విశాఖపట్టణం
మంగళవారం 4 ఆగస్టు 2026

For a pure tomorrow..

# జయజయహే


epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:189 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## మరో మహిళతోనూ రిలేషన్!

### ఉదయ్ కృష్ణారెడ్డి నిర్వాకం

### పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే అంశాలు



(హైదరాబాద్ - జయజయహే)

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి.. సస్పెండ్, అరెస్ట్‌తో హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ పేరు.. ఆల్ ఆఫ్ సడెన్‌గా తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన విషయం తెలిసిందే.. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై.. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి సంచలన ఆరోపణలు చేశారు. లైంగిక దాడి, బెదిరింపులు, వేధింపులకి గురిచేశాడని ఆమె ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఈ కేసులో ఉదయ్ అరెస్ట్‌తో పాటు రిమాండ్ కూడా జరిగిపోయింది. అయితే.. ..మిగతా 2లో



## డేటా ఆధారిత పాలన

### డేటా డ్రైవన్ డెసిజన్ మేకింగ్ కీలకం

### సమర్థ పాలన, సులభతర సేవలు

### సీఎం చంద్రబాబు ఆదేశాలు

(అమరావతి - జయజయహే)

అన్ని శాఖల్లో డేటా ఆధారిత పాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆర్‌టీజీఎస్‌లో డేటా ఆధారిత నిర్ణయాలపై సీఎం చంద్రబాబు సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డేటా డ్రైవన్ డెసిజన్ మేకింగ్ పై అధికారులకు సీఎం మార్గనిర్దేశం చేశారు. సీఎం సమీక్షకు ఏపీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, ఐటీ, ఆర్‌టీజీఎస్, వ్యవసాయం, మున్సిపల్, సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థ పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆర్‌టీజీ ద్వారా పాలన మరింత సమర్థవంతంగా, సులభంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలతో డేటా వినియోగాన్ని పెంచాలని ఆదేశించారు. ఆయా శాఖల వారీగా డేటా సమన్వయంపై అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు.

# బాబు క్రెడిట్.. జగన్ చోరీ

### పేరు తెచ్చే ప్రాజెక్టులే టార్గెట్

### ప్రధాని సభపైనా దుష్ప్రచారమేనా

### వైఎస్సార్ సీపీపై ఎమ్మెల్యే గంటా ఆగ్రహం





(విశాఖపట్నం - జయజయహే)

గూగుల్, మిట్టల్ స్టీల్ ప్లాంట్, కడప స్టీల్ ప్లాంట్, భోగాపురం ఎయిర్ పోర్టు.. ఏ ప్రాజెక్టు తెచ్చినా దానికి కర్త, కర్మ, క్రియా తానేనని ప్రచారం చేసుకోవడం జగన్మోహన్ రెడ్డి రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని తెలిపారు. విశాఖ పెట్టుబడిదారుల సదస్సు మొదలు ప్రస్తుత భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం వరకు ప్రజల దృష్టి మళ్లించే కుట్ర చేస్తున్నారన్నారు. ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి 48 గంటల ముందు శ్రీకాకుళం జైల్లో మాజీ మంత్రి సీదరి అప్పలరాజు ములాఖాత్ కు రావడం అందులో భాగమేనని ఆరోపించారు. ముందస్తు ప్రణాళిక ప్రకారమే విశాఖ నుంచి బలప్రదర్శనగా రోడ్ షో చేసుకుంటూ సమయం మించిపోయాక శ్రీకాకుళం చేరారని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో 2015లో విజయనగరం ఇంచార్జ్ మంత్రిగా తాను భోగాపురం ఎయిర్ పోర్టు కోసం 2 వేల ఎకరాల ..మిగతా 2లో

# సహజీవనంలోనూ గృహహింస చట్టం



### లైవ్ ఇన్ రిలేషన షిప్ లోనూ 498ఏ చట్టం వర్తింపు

### చట్టబద్ధమైన వివాహం కాకపోయినా, స్పష్టమైన ఉద్దేశ్యం ఉంది

### చారిత్రాత్మక తీర్పును వెలువరించిన సుప్రీంకోర్టు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

భారత అత్యున్నత న్యాయస్థానం మహిళల హక్కుల పరిరక్షణలో మరొక అత్యంత కీలకమైన, చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. వివాహబంధాన్ని పోలి ఉండే లైవ్-ఇన్ సంబంధాలలో భాగస్వామి నుంచి వేధింపులు లేదా గృహహింసకు గురయ్యే మహిళలకు రక్షణ కల్పిస్తూ, ఇండియన్ పీనల్ కోడ్ లోని సెక్షన్ 498ఏ చట్టం వారికి కూడా వర్తిస్తుందని ధర్మాసనం సంచలన తీర్పునిచ్చింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం ఈ కీలక తీర్పును వెలువరించింది. చట్టపరమైన వివాహం లేకపోయినా, వివాహ బంధాన్ని పోలి ఉండి, పెళ్లి చేసుకోవాలనే స్పష్టమైన ఉద్దేశం ఉన్న సంబంధాలలో వేధింపులు ఎదుర్కొంటే ఈ చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని ..మిగతా 2లో

## ఉరవకొండలో ఉద్రిక్తత

### వైసీపీ, టీడీపీ పోటాపోటీ నిరసనలు

### ఇరు పక్షాల నేతలు అరెస్టు



(అనంతపురం - జయజయహే)

రాష్ట్రంలో మంత్రులు బరితెగించి ప్రైవేటు ఆస్తులు కాజేస్తున్నారని వైసీపీ ఆరోపిస్తోంది. ఉరవకొండలో మంత్రి పయ్యావుల కేశవ్‌కు వ్యతిరేకంగా భారీ ఎత్తున ఆందోళనకు ప్లాన్ చేసింది. ఈ నిరసన ధర్నాకు కోర్టు నుంచి కూడా అనుమతులు తెచ్చుకున్నట్టు వైసీపీ నేతలు చెబుతున్నారు. అయినా పోలీసులు ఆందోళన చేపట్టకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తున్నారు. నేతల అరెస్టును పార్టీ తీవ్రంగా ఖండించింది. ఉరవ కొండలోని వేల్పుమడుగులో వైసీపీ నేతకు చెందిన భూమిని మంత్రి పయ్యావుల కేశవ్ ఆక్రమించుకున్నారని వైసీపీ ..మిగతా 2లో

## బీజేపీ కోటలో ప్రశాంత్ కిశోర్ పాగా

### బాంగీపూర్ బై ఎలక్షన్‌లో ఘనవిజయం

### ఎట్టకేలకు బోణీ కొట్టిన జనసురాజ్ పార్టీ

### గతంలో 50 వేల మెజార్టీతో బీజేపీ అధ్యక్షుడు నితిన్ గెలుపు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

బిహార్ ఉపఎన్నికలో బాంకీపూర్ స్థానం నుంచి ప్రశాంత్ కిషోర్ విజయం సాధించారు. ఆయన జనసురాజ్ పార్టీ ఎట్టకేలకు బోణీ కొట్టింది. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌పై ప్రశాంత్ కిషోర్ 18 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 1995 నుంచి ఈ స్థానంలో బీజేపీ ఎప్పుడూ ఓడిపోలేదు. బిహార్ రాజకీయాల్లో కంచుకోటగా భావించే బాంకీపూర్ ఉపఎన్నిక ఫలితాలు బీజేపీకి గట్టి షాక్ ఇచ్చాయి. బీజేపీ ఊహించని ఓటమి చవిచూడడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. గతేడాది ఎన్నికల్లో ఏకంగా 50 వేలకు పైగా భారీ మెజారిటీతో గెలిచిన ..మిగతా 2లో



# బీజేపీకి ఘోర పరాభవం

### మూడు ఉప ఎన్నికల్లో రెండు స్థానాల్లో ఓటమి

### ఓడిన రాష్ట్రాల్లో అధికారంలోనే ఉన్న కమలం

### ఓటమిపై జెన్ జీ ఉద్యమ ప్రభావం

### జంతర్ మంతర్‌లో ఉద్యమం ముగిసినా, ఆరని జ్వాలలు



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)


దేశంలోని గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో (మంజల్‌పూర్, దాతియా, బంకీపూర్) మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీ కూటమి అధికారంలోకి ఉంది. అయితే, ఈ ఉప ఎన్నికల ఫలితాలు సోమవారం వెల్లడికాగా.. రెండు రాష్ట్రాల్లో బీజేపీకి పరాభవం తప్పలేదు. కేవలం గుజరాత్‌లో మాత్రమే బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఆ పార్టీ అభ్యర్థులు ఓడిపోవటం ..మిగతా 2లో

## న్యాయమూర్తుల సంఖ్య పెంపునకు ఓకే

### 34 నుంచి 38కి పెంపునకు గ్రీన్ సిగ్నల్

### చర్చ లేకుండానే ఆమోదం తెలిపిన సభ

2




## విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ

### సన్నాహాలు చేసుకుంటున్నట్లు టాక్

### త్వరలోనే ప్రాంతాల వారీ సభలు

### శ్రావణమాసంలో అధికారిక ప్రకటన

### రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం

(అమరావతి - జయజయహే)

రాష్ట్రంలో మరో కొత్త పార్టీకి తెర లేవనుందని లోకల్ పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ సాగుతోంది. పొలిటికల్ ఎంట్రీకి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రంగం సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. చాలాకాలం వైసీపీలో ఉన్న ఆయన, కొన్నాళ్ల కిందట ఆ పార్టీకి ..మిగతా 2లో



# బాబు క్రెడిట్.. జగన్ చోరీ

**మొదటి పేజీ తరువాయి...**

భూ సమీకరణ చేశానన్నారు. జగన్మోహన్ రెడ్డి డైరక్షన్ లో అప్పటి వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఆ పార్టీకి చెందిన రాయివలస సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి, మాజీ జెడ్పీటీసీ బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రెడ్డి కంచేరు మాజీ సర్పంచ్ శీరపు గురునాథరెడ్డి, సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీను రాజు, వైసీపీ ఎమ్మెల్యే వియ్యపురాలు దాట్ల శ్రీదేవి తదితరులు కేసులు వేసి భూసేకరణకు ఆటంకాలు సృష్టించారని పేర్కొన్నారు.



**టీడీపీ హయాంలోనే భోగాపురం ఎయిర్ పోర్టు**

2014 లో ఎయిర్ పోర్టు ప్రతిపాదన తెరపైకి వచ్చిందని, భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు కార్పొరేషన్ లిమిటెడ్ పేరుతో స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటైందని గంటా చెప్పారు. 2017 మార్చి, ఏప్రిల్ లలో రక్షణ శాఖ నుంచి డిఫెన్స్ సహా పర్యావరణ, అటవీ శాఖల అనుమతులు వచ్చాయని, 2019 ఫిబ్రవరి లో జరిగిన ప్రీ బిడ్డింగ్ లో జీఎంఆర్ ఆ కాంట్రాక్టు దక్కించుకుందని వివరించారు. ప్రతిపక్ష నేతగా "ఎర్ర బస్సు రాని ప్రాంతానికి ఎయిర్ బస్సు కావాలా!", "విశాఖ ఎయిర్ పోర్టు ఈగలు తోలుకుంటే భోగాపురం ఎయిర్ పోర్టు అవసరమా!", "కోర్టులో కేసులు వేసైనా భూములు వెనక్కి రప్పిస్తా".. అంటూ మాట్లాడిన జగన్మోహన్ రెడ్డి భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభించే సమయానికి అంతా తన గొప్పేనని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. చిత్తశుద్ధితో వ్యవహరించి ఉంటే జగన్ అధికారంలో ఉండగానే భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం పూర్తయ్యేదని తెలిపారు. 2024 లో అధికారంలోకి వచ్చాక రెండేళ్ల గడువు నిర్దేశించి సీఎం చంద్రబాబు నాయుడు ఎయిర్ పోర్టు ప్రజలకు అందుబాటులోకి తెచ్చారన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద నియోజకవర్గం భీమిలి.. అభివృద్ధిలోనూ శరవేగంతో పరుగులు తీస్తోందని, రాబోయే 4-5 సంవత్సరాల్లో ఈ ప్రాంతం ఎవరు ఊహించని విధంగా మారిపోతుందని చెప్పారు.



# ఉరవకొండలో ఉద్రిక్తత

**మొదటి పేజీ తరువాయి...**

విమర్శిస్తున్నారు. నియోజకవర్గంలో ఆయన భూదందా పెరిగిపోతుందని నేడు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ధర్నాకు పిలుపునిచ్చారు. ఆయన పిలుపు మేరకు అనంతపురం జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నేతలంతా ఉరవకొండ వచ్చేందుకు ప్రయత్నాలు చేశారు. వైసీపీ నేతల ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. ఎక్కడికక్కడ నేతలను అరెస్టు చేశారు. దీనిపై వైసీపీ లీడర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నేతల అక్రమాలకు పోలీసులు, రెవెన్యూ అధికారులు అండగా నిలబడుతున్నారని మండిపడ్డారు. వారి అరాచకలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. గుంతకల్ సబ్ డివిజన్‌లో పోలీస్ యాక్ట్-30 అమలులో ఉందని ఉరవకొండలో నిరసనలకు అనుమతి లేదన్నారు పోలీసులు. అయినా సరే ధర్నా నిర్వహిస్తామంటూ వీడియో విడుదల చేశారు విశ్వేశ్వర్‌రెడ్డి. ఈ ధర్నాకు సంఘీభావంగా వస్తున్న వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పెనుకొండలో మాజీ మంత్రి శంకర నారాయణ హౌస్ అరెస్ట్ చేశారు. గత ప్రభుత్వంలో బీసీలపై దాడులు చేశారను, భూకబ్జాలకు పాల్పడ్డారని టీడీపీ ఆరోపిస్తోంది. వైసీపీ నేతలు చేస్తున్న ధర్నాలకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టింది. దేవాలయ భూముల పరిరక్షణకు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇరువర్గాల మధ్య సాగుతున్న పోటాపోటీ నిరసనలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని పోలీసులు చెబుతున్నారు. అనుమతులు లేకుండా ధర్నాలు చేస్తే అరెస్టు చేశామని పేర్కొన్నారు.



# బీజేపీకి ఘోర పరాభవం

**మొదటి పేజీ తరువాయి...**

ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఓటమికి కారణం స్థానిక కారణాలతోపాటు.. ఇటీవల జరిగిన జెన్‌జీ ఉద్యమ ప్రభావం కూడా కారణమై ఉండొచ్చునని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్ మూడుచోట్లా బీజేపీ ప్రభుత్వమే అధికారంలో ఉంది. అయినా, రెండు రాష్ట్రాల్లోని ఉప ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులు ఓడిపోవటం బీజేపీకి పెద్ద దెబ్బగానే భావించాలి. అయితే, అది జెన్‌జీ వల్లే అయిందా? అంటే ఔనని చెప్పలేం. అలాఅని, కాదని కూడా చెప్పలేం. ఎందుకంటే.. బీహార్ రాష్ట్రంలోనూ నిరసనలు చాలా గట్టిగానే జరిగాయి. స్టూడెంట్స్ నిరసనలు, జెన్‌జీ ఉద్యమంతో ప్రభావితం అయిన వాళ్లు బీజేపీకి వ్యతిరేకంగా ఓటువేసి ఉండొచ్చు. అయితే, జెన్ జీ ఓటర్లు ఆ రెండు నియోజకవర్గాల్లో ఎంతమంది ఉన్నారనేది లెక్కతీస్తేనేగానీ.. జెన్ జీ ఉద్యమం వల్లనే బీజేపీ అభ్యర్థులు ఓడిపోయారని చెప్పగలం. ఇదిలాఉంటే.. ఎన్నికలు జరిగిన జులై 30వ తేదీ నాటికి జంతర్ మంతర్ వద్ద నిరసనలకు ఫుల్ స్టాప్ పడింది. కానీ, ఆ ప్రభావం కొంతకాలం ఉంటుంది. కాబట్టి మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లోని రెండు నియోజక వర్గాల్లో జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఓడిపోయి ఉండొచ్చునని కొందరు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అయితే, ఎక్కువ శాతం మాత్రం స్థానిక ప్రభుత్వాల ఫెయిల్యూర్ గా భావించాలని, అందుకు కొంతశాతం జన్ జీ ఉద్యమం, ఆయా రాష్ట్రాల్లో స్టూడెంట్స్ నిరసనలు కారణం అయ్యి ఉండొచ్చునని పేర్కొంటున్నారు. మొత్తానికి రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉండికూడా ఆ రెండు చోట్ల ఉపఎన్నికల్లో ఓడిపోవటం బీజేపీకి బిగ్ షాకేనని చెప్పొచ్చు.

**మూడు రాష్ట్రాల్లో ఉప ఎన్నికల ఫలితాలు ఇలా..**

గుజరాత్ రాష్ట్రం వడోదర జిల్లాలోని మంజల్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి సతీష్ పటేల్ సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భిఖాభాయ్ రబారిపై 30వేల ఓట్లకుపైగా మెజార్టీతో విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థికి 55,084 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి రబారికి 24,585 ఓట్లు పోలయ్యాయి.

మధ్యప్రదేశ్‌లోని దాతియా నియోజకవర్గంకు జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఘన్‌శ్యామ్ సింగ్ విజయం సాధించారు. ఆయనకు 66,757 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి ఆశుతోష్ తివారికి 60,741 ఓట్లు పోలయ్యాయి. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి ఘన్‌శ్యామ్ సింగ్ సుమారు 6016 ఓట్ల తేడాతో విజయం సాధించినట్లు ఎన్నికల సంఘం డేటా ద్వారా తెలుస్తోంది.

బీహార్ రాష్ట్రంలోని బాంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గంకు జరిగిన ఉపఎన్నికల్లో జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ విజయం సాధించాడు. తద్వారా బీజేపీ కంచుకోటను ఆయన బద్దలు కొట్టారు. తొలి రౌండ్ నుంచి ఆధిక్యం ప్రదర్శించిన ప్రశాంత్ కిషోర్.. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌పై 18,964 ఓట్ల ఆధిక్యంతో ఘన విజయం సాధించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు అడ్డాగా పేరొందిన ఈ నియోజకవర్గంలో దాదాపు 30ఏళ్ల తర్వాత బీజేపీ ఓటమిపాలవ్వడం గమనార్హం.



# సహజీవనంలోనూ గృహహింస చట్టం

**మొదటి పేజీ తరువాయి...**

కోర్టు స్పష్టం చేసింది. ర్ణాటకకు చెందిన డాక్టర్ లోకేష్ బి.హెచ్. దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. బాధితురాలు పిటిషనర్‌పై తన మొదటి వివాహాన్ని దాచిపెట్టి, తనను భార్యగా చూస్తూ కట్నం వేధింపులకు, శారీరక దాడికి పాల్పడ్డారని క్రిమినల్ కేసు నమోదు చేసింది. అయితే, వారి మధ్య చట్టబద్ధమైన వివాహం జరగలేదని, కాబట్టి సెక్షన్ 49ఏ ప్రకారం తాను భర్త పరిధిలోకి రానని పిటిషనర్ వాదించారు. దీనిపై విచారణ జరిపిన కర్ణాటక హైకోర్టు క్రిమినల్ చర్యలను కొట్టివేసేందుకు నిరాకరించగా, పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ అప్పీలును తోసిపుచ్చిన అత్యున్నత న్యాయస్థానం, హైకోర్టు తీర్పును సమర్థిస్తూ విచారణ కొనసాగాల్సిందేనని స్పష్టం చేసింది. చట్టాల్లోని భర్త అనే పదానికి విశాలమైన, ఉద్దేశపూర్వకమైన వ్యాఖ్యానం అవసరమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. చట్టబద్ధంగా పెళ్లయిన మహిళకు, వివాహ బంధాన్ని పోలి ఉండే లైవ్-ఇన్ భాగస్వామికి మధ్య గృహహింస వేధింపుల విషయంలో వ్యత్యాసం చూపడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వ హక్కు ను ఉల్లంఘించడమే అవుతుందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. గృహహింస నిరోధక చట్టం కేవలం సివిల్ ఉపశమనాలను మాత్రమే అందిస్తుందని, తీవ్రమైన శారీరక, మానసిక వేధింపులు మరియు కట్న వేధింపుల నుంచి రక్షణ పొందడానికి క్రిమినల్ బాధ్యతను మోపే సెక్షన్ 49ఏ వర్తింపు చాలా అవసరమని కోర్టు పేర్కొంది.

అయితే, ఈ చట్టం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు సుప్రీంకోర్టు కొన్ని కీలకమైన నిబంధనలు, స్పష్టతలను జత చేసింది. ప్రతి లైవ్-ఇన్ సంబంధానికీ ఇది వర్తించదని, ఆ బంధం వివాహ స్వభావాన్ని కలిగి ఉండటంతో పాటు, వారిద్దరికీ పెళ్లి చేసుకునే ఉద్దేశం ఉందనే ప్రాథమిక ఆధారాలను మహిళ నిరూపించాల్సి ఉంటుందని ధర్మాసనం తెలిపింది. అంతేకాకుండా, ఈ నిబంధనల కింద నమోదు చేసే కేసుల్లో అర్నేష్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్ కేసులోని మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, ప్రాథమిక విచారణ నిర్వహించకుండా అరెస్టులు చేయకూడదని పోలీసులను ఆదేశించింది. ఈ చారిత్రాత్మక తీర్పు దేశంలో మారుతున్న సామాజిక సమీకరణలు, ఆధునిక జీవనశైలికి అనుగుణంగా మహిళల చట్టపరమైన హక్కులను మరింత బలపరిచిందని న్యాయ నిపుణులు అంటున్నారు. కేవలం 49ఏ చట్టానికి మాత్రమే ఈ విస్తరణ పరిమితమని, ఇతర క్రిమినల్ లేదా సివిల్ నిబంధనలకు ఇది వర్తించదని ధర్మాసనం ప్రత్యేకంగా పేర్కొనడం ద్వారా చట్టపరమైన సమతుల్యతను కాపాడిందని న్యాయకోవిదులు పేర్కొంటున్నారు.

# బీజేపీ కోటలో ప్రశాంత్ కిశోర్ పాగా

**మొదటి పేజీ తరువాయి...**



బీజేపీ, ఇప్పుడు ఈ స్థానాన్ని కోల్పోవడం పార్టీ వర్గాలను విస్మయానికి గురిచేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ ప్రాతినిధ్యం వహించిన ఈ స్థానంలో కమల దళం పరాజయం పాలవడానికి గల అంతర్గత కారణాలపై పార్టీ అధిష్టానం లోతైన విశ్లేషణ మొదలుపెట్టింది. ఈ ఓటమిపై బీజేపీ నేతలు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఆర్జేడీ తన కోర్ ఓట్లను ప్రశాంత్ కిశోర్ పార్టీకి బదిలీ చేయించిందని బీజేపీ అంచనా వేస్తోంది. బీజేపీకి పట్టున్న అగ్రవర్ణ ఓట్లలో చీలిక తెచ్చేందుకే ఆర్జేడీ ఈ వ్యూహం పన్నిందని భావిస్తోంది. తేజస్వీ యాదవ్ కేవలం ఒక గంట మాత్రమే ప్రచారం చేయడం వెనుక మర్మం ఇదేనని చెబుతోంది. మూడు దశాబ్దాలకు పైగా నితిన్ నబీన్ కుటుంబం ఈ నియోజకవర్గంలో గెలుపొందుతూ వస్తోంది. తండ్రి మరణం అనంతరం ఉప-ఎన్నికల్లో పోటీ చేసిన నితిన్ నబీన్, అప్పటి నుంచి వరుసగా గెలుపొందుతూ వచ్చారు. కానీ ఇప్పుడు ఆయన బీజేపీ జాతీయాధ్యక్షుడు కావడంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, రాజ్యసభ ద్వారా పార్లమెంటులో అడుగుపెట్టారు. ఈ పరిస్థితుల్లో అక్కడ అభ్యర్థి మార్పు అనివార్యంగా మారింది. ఈ మార్పు ఓటర్లపై ప్రభావం చూపిందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. నీట్ పేపర్ లీక్ అంశంపై ఆందోళనలు, యూజీసీ మార్గదర్శకాలు, భరత్ తివారీ ఎన్‌కౌంటర్ వంటి పరిణామాల పట్ల బీజేపీ ప్రధాన కోర్ ఓటర్ల వర్గంలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఇది కూడా ప్రతికూల ప్రభావం చూపిందని పార్టీ భావిస్తోంది. "ఇది కేవలం ఒక స్థానానికి జరుగుతున్న ఉపఎన్నిక మాత్రమే, దీనివల్ల బిహార్ ప్రభుత్వానికి వచ్చే ముప్పేమీ లేదు" అనే భావనలో ఓటర్లు ఉండటంతో.. పోలింగ్ సరళిపై ఆ ప్రభావం పడింది. అందుకే పోలింగ్ శాతం అత్యల్పంగా నమోదైంది. ఇది బీజేపీ కొంపముంచింది. ప్రశాంత్ కిశోర్ పార్టీకి ఎక్కడెక్కడ నుంచి ఎన్ని ఓట్లు పడ్డాయి అనే దానిపై బూత్ వారీగా విశ్లేషణ జరపాలని బీజేపీ నిర్ణయించింది. పార్టీ కోర్ ఓటర్లు ఎందుకు దూరమయ్యారు, ఏయే వర్గాలు చేజారాయి అనే దానిపై పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించి తగిన దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కమల దళం భావిస్తోంది.



# న్యాయమూర్తుల సంఖ్య పెంపునకు ఓకే

## 34 నుంచి 38కి పెంపునకు గ్రీన్ సిగ్నల్

## చర్చ లేకుండానే ఆమోదం తెలిపిన సభ

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రధాన న్యాయమూర్తితో కలిపి 34 నుంచి 38కి పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే, నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండటంతో ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు ఆమోదం పొందింది. ఆర్డినెన్స్ జారీని వ్యతిరేకిస్తూ విపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో సభ తిరస్కరించింది. సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు-2026ను సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దాని గురించి వివరించారు. అనంతరం బిల్లుపై సభ్యులు మాట్లాడాలని సభాపతి ఓం బిర్లా కోరినప్పటికీ, విపక్షాల నినాదాలు కొనసాగడంతో బిల్లును ఓటింగ్‌కు పెట్టారు. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026కు సభ ఆమోదం తెలిపింది. ఇటీవల జనన, మరణాల నమోదు చట్ట సవరణ బిల్లు కూడా లోక్‌సభలో చర్చ లేకుండానే ఆమోదం పొందింది. తాజా బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభను స్పీకర్ వాయిదా వేశారు.

# మరో మహిళతోనూ రిలేషన్!

**మొదటి పేజీ తరువాయి...**

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో ట్విస్ట్‌ల మీద ట్విస్టులు వెలుగు చూస్తున్నాయి.. ఉదయ్ కృష్ణారెడ్డికి మరో మహిళతోనూ సన్నిహిత సంబంధాలున్నాయని పోలీసులు దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం.. తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ట్రైనీ మహిళా ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదుతో అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే.. ఉదయ్ ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ ఈ కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. అయితే.. ఉదయ్ కృష్ణారెడ్డి మరో మహిళతోనూ రిలేషన్‌షిప్ లో ట్రైనీ మహిళా ఐపీఎస్ ఫిర్యాదు చేయగా.. ఆ దిశగా దర్యాప్తు చేసిన అధికారులు కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం..

**రెండు ప్రేమ లేఖలు స్వాధీనం..**

కేసు దర్యాప్తులో భాగంగా.. పోలీసులు అశోక్‌నగర్‌లోని ఉదయ్ కృష్ణారెడ్డి గదిలో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఉదయ్ కృష్ణారెడ్డి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ అలాగే.. ఇద్దరు వ్యక్తుల చేతిరాతతో ఉన్న రెండు ప్రేమ లేఖలు, కత్తి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే.. ప్రేమలేఖలపై రాసిన పేర్ల ఆధారంగా ఆరా తీసిన పోలీసులకు మరో కొత్త ఆధారం దొరికింది. ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ మహిళతో సన్నిహిత సంబంధం ఉన్నట్లు పేర్కొంటున్నారు. సదరు మహిళకు 2014లోనే వివాహం కాగా.. ఆమె 2023 నుంచి భర్తకు దూరంగా కుమారుడితో కలిసి ఉంటోంది.. ఈ సమయంలో ఉదయ్ కృష్ణారెడ్డితో ఆమెకు స్నేహం కుదిరింది. హైదరాబాద్ వచ్చిన ఆమె కొంతకాలం ప్రైవేటు సంస్థలో పనిచేసి.. ఈ ఏడాది జనవరిలో ఉదయ్ కృష్ణారెడ్డి సూచనల మేరకు ఆ ఉద్యోగానికి రాజీనామా చేసింది. అనంతరం అశోక్‌నగర్‌లోని ఓ ఐఏఎస్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తోంది. అయితే.. లివ్ ఇన్ రిలేషన్‌లో ఉందామని ఉదయ్ కృష్ణారెడ్డి కోరినా.. చట్టప్రకారం విడాకులు రాకపోవటంతో ఆమె తిరస్కరించినట్టు తెలుస్తోంది.


**ఎలా బయటకు వచ్చిందంటే..**

అశోక్‌నగర్‌లో ఉంటున్న ఆ మహిళను మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిబ్రవరిలో కలవగా.. ఈ విషయం బయటకు వచ్చింది. తాను కూడా ఉదయ్ తో సన్నిహితంగా ఉన్నానని, ఆయన తనపై దాడి చేస్తున్నాడని.. ఇబ్బంది పెడుతున్నాడంటూ మహిళా ట్రైనీ ఐపీఎస్ బాధను పంచుకున్నట్లు సమాచారం.. దీంతో సదరు మహిళ నిందితుడికి దూరంగా ఉంటున్నట్టు గుర్తించారు. అయితే.. ఈ కేసులో పలు కోణాల్లో విచారణ జరుపుతున్న పోలీసులు పలువురి నుంచి వాంగ్మూలాలు సేకరించినట్లు తెలుస్తోంది.

# విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ

**మొదటి పేజీ తరువాయి...**

గుడ్‌బై చెప్పారు. అడపాదడపా వైసీపీ టార్గెట్‌గా విమర్శల బాణాలు సంధిస్తున్నారు. వైసీపీకి వ్యతిరేకంగా శలో పోస్టులు పెడుతున్నారు. అటు టీడీపీపై కూడా విమర్శలు ఎక్కుపెడుతున్నారు. రాజధాని నిర్మాణంలో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఆయన వైసీపీని వద్దనుకున్నారు. టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చే పరిస్థితి లేదు. అయితే బీజేపీకి కోరస్‌గా హిందుత్వ సైరన్ మోగిస్తున్నారు.



# కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

**నిడదవోలు జయ జయ ప్రతినిధి**



ప్రజా అవసరాలకు అనుగుణంగా నిడదవోలు--ఏలూరు--విజయవాడ నూతన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీస్‌ను రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ప్రారంభించారు. నిడదవోలు డిపో వద్ద కొబ్బరికాయ కొట్టి, జెండా ఊపి బస్సు సర్వీస్‌ను ప్రారంభించిన మంత్రి అనంతరం స్థానిక నాయకులతో కలిసి ప్రయాణించారు. ఈ బస్సు నిడదవోలు నుంచి ఎర్నగూడెం, నల్లజర్ల, భీమడోలు, ఏలూరు, హనుమాన్ జంక్షన్, గన్నవరం మీదుగా విజయవాడ చేరుకుంటుంది. మహిళలు, ప్రయాణికుల విజ్ఞప్తిపై స్పందించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చామని మంత్రి తెలిపారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం మరింత ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రధాన నగరాలకు భవిష్యత్తులో మరిన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆర్టీసీ బస్సులు మెరుగైన కండిషన్‌లో ఉండేలా, భద్రతా ప్రమాణాలు పాటించేలా అధికారులను ఆదేశించారు. నూతన బస్సు సర్వీస్ అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజలు, మహిళా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యపై తక్షణమే స్పందించి బస్సు సౌకర్యం కల్పించిన మంత్రి కందుల దుర్గేష్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



## వెంకన్న వారసత్వానికి
# మాజీ సిఎం కిరణ్ ప్రశంస

**రాజమహేంద్రవరం:జయ జయహే**

ఆగస్టు 3 కడియంనర్సరీ రంగంలో దివంగత పల్ల వెంకన్న ఒక బ్రాండ్ అని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కడియంలోని పల్ల వెంకన్న నర్సరీని ఆయన సందర్శించి, దివంగత పల్ల వెంకన్నతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా నర్సరీ నిర్వాహకులు పల్ల సత్యనారాయణమూర్తి, పల్ల సుబ్రమణ్యం, పల్ల గణపతి, పల్ల వినయ్‌లు మాజీ ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికి గజ్మేనియా మొక్కను అందజేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పల్ల వెంకన్న ప్రతి నెలా “గుడ్ లక్ బాంబూ” మొక్కనుబహుమతిగా తీసుకువచ్చేవారని, నర్సరీ రంగ అభివృద్ధికి అనేక సూచనలు చేసేవారని కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా నర్సరీలకు ఉచిత విద్యుత్ కొనసాగించాలని పలుమార్లు కోరడంతో, ఆయన విజ్ఞప్తి మేరకే ఉచిత విద్యుత్‌కు జీవో జారీ చేసినట్లు వెల్లడించారు. నర్సరీ ప్రాంత రహదారుల అభివృద్ధిపైనా పల్ల వెంకన్న ప్రత్యేక శ్రద్ధ చూపేవారని గుర్తుచేశారు. పల్ల వెంకన్న ఆశయాలను ఆయన కుమారులు కొనసాగిస్తూ నర్సరీ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం సుమారు రెండు గంటల పాటు నర్సరీలో పర్యటించి వివిధ రకాల మొక్కలను పరిశీలించి, నర్సరీ రైతుల కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కె.వి.సత్యనారాయణరెడ్డి, ఎస్.టి. రాజా, ఊబలంక ఎం.ఎస్.ఎన్. రెడ్డి, కడియపులంక సొసైటీ అధ్యక్షుడు గట్టి నరసయ్య, జిల్లా బిజెపి అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కాకినాడ జిల్లా ఇన్‌చార్జి ఆకుల శ్రీధర్, మండల అధ్యక్షుడు బొరుసు సుబ్రమణ్యం, చిక్కాల ఈశ్వరరావు, చిక్కాల శ్రీను, గారపాటి తాతబ్బాయి, దాసరి ముత్యం, పెనుమాక శేషగిరి, కోటికలపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# డిఎస్సి అవకతవకలు మీద సిబిఐ ఎంక్వయిరీ చేయాలి

## విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ రాజీనామ చేయ్యాలి

**చోడవరం ఆగస్టు 3 జయ జయహే**

డీఎస్సీ అవకతవకలపై దర్యాప్తు నిర్వహించి, అందుకు కారకలైన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. సోమవారం చోడవరం పార్టీ కార్యాలయంలో జరిగిన నిర్వహించిన పత్రిక సమావేశంలో మాజీ మంత్రి చోడవరం నియోజకవర్గ ఇన్చార్జి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ ఎన్నికల లో ఇచ్చిన హామీలు విద్యాదేవన,వసతి దేవన 6000 కోట్లు చెల్లించాలనీ, నిరుద్యోగ భృతి అమలు చేయాలనీ,గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులు,కార్మికుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 6,7,8,9 తేదీలలో నియోజకవర్గంలో గల నాలుగు మండలాల లో ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. వీటి పై నియోజకవర్గం స్దాయిలో ఈ నెల 10 వ న ర్యాలీ జరుగుతాదని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి నాలుగు మండలాలు విభజన విభాగ అధ్యక్షులు, విద్యార్థి విభాగ అధ్యక్షులు, సోషల్ మీడియా అధ్యక్షులు పాల్గొన్నారు.

# “స్టేడియం మాటల్లోనే!”

**రాజమహేంద్రవరం: జయ జయహే : ఆగస్ట్3**




రాజమండ్రిలో ఇప్పటికీ అంతర్జాతీయ ప్రమాణాల స్టేడియం లేకపోవడం దురదృష్టకరమని రాజమహేంద్రి విద్యా సంస్థల చైర్మన్ టి.కె. విశ్వేశ్వర రెడ్డి అన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు ఏళ్లుగా స్టేడియంపై హామీలు ఇస్తున్నప్పటికీ కార్యరూపం దాల్చలేదని విమర్శించారు. రాజమహేంద్రి స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో క్రికెట్, రన్నింగ్, కరాటే, వాలీబాల్, షటిల్‌తో పాటు రైఫిల్ షూటింగ్, ఆర్చరీ, హార్స్ రైడింగ్, స్కేటింగ్ వంటి క్రీడల్లో శిక్షణను అందిస్తున్నామని తెలిపారు. నెలకు రూ.500 ఫీజుతో ప్రతి ఆదివారం శిక్షణ ఉంటుందని, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులను ప్రోత్సహిస్తామని చెప్పారు. సమావేశంలో స్కేటింగ్ శిక్షకుడు కె. రాము, హార్స్ రైడింగ్ శిక్షకుడు గణేష్ పాల్గొన్నారు.




# తిమ్మరాజుపేటలో తల్లిపాల వారోత్సవాలు అవగాహన

**అచ్యుతాపురం ఆగస్టు 3 జయ జయహే**

మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో సోమవారం తల్లి పాలు వారోత్సవాలు కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యత గురించి వైద్య సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు తల్లులకు బాలింతలకు చూలింతలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఈరిగిన భారతి కారు వెంకటలక్ష్మి ఏఎన్ఎం సిహెచ్ లక్ష్మికాంత ఎమ్మెల్యే జన విజ్ఞాన వేదిక నాయకులు మారిశెట్టి వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు ఆగస్టు ఒకటో తేదీ నుండి 7వ తేదీ వరకు తల్లిపాల ప్రాధాన్యత గురించి అంగన్వాడీ కేంద్రాల ద్వారా మహిళలకు గర్భిణీలకు వివరించడం జరుగుతుందని అంగన్వాడీ టీచర్లు ఇరుగుల భారతి కారు వెంకటలక్ష్మి తెలిపారు

# గట్టు ప్రమాదంలో ఉంది..

## నిర్లక్ష్యం వీడకపోతే హైకోర్టుకే మార్గాని భరత్

**రాజమహేంద్రవరం: జయ జయహే:ఆగస్టు 3**

గోదావరి రివర్‌ఫ్రంట్ పనుల్లో పాలకుల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనత వల్ల రాజమహేంద్రవరం నగరం తీవ్ర ప్రమాదంలో పడుతోందని మాజీ ఎంపి , వైఎస్సార్‌సిపి జాతీయ అధికార ప్రతినిధి, రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి మార్గాని భరత్ రామ్ ఆరోపించారు. సోమవారం మార్కండేయస్వామి ఆలయం సమీపంలోని రివర్‌ఫ్రంట్ నిర్మాణ పనులను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించిన ఆయన, గోదావరి గట్టు పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి గట్టు మట్టి జారిపోవడం, బండ్ రోడ్డు కుంగిపోతుండటంతో ఇసుక బస్తాలు వేసి తాత్కాలిక చర్యలు చేపట్టడం అధికారుల వైఫల్యానికి నిదర్శనమన్నారు. ప్రస్తుతం రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందని, గతంలో 20 నుంచి 25 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదలైన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేస్తూ, మరింత వరద వస్తే నగర పరిస్థితి ఏమవుతుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గోదావరి గట్టు కూలిపోయే పరిస్థితి ఏర్పడితే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, లేకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఇరిగేషన్ శాఖ సూచనలు, నిబంధనలు పాటించకుండా పనులు చేపట్టడం అత్యంత ప్రమాదకరమని అన్నారు. కోటిలింగాల రేవులో ఏర్పాటు చేసిన స్క్రీన్ వరద నీటిలో మునిగిపోయిందని, తగిన ఎత్తులో నిర్మించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు.



కంబాలచెరువు పంపింగ్ స్టేషన్‌ను సమర్థంగా వినియోగించకపోవడంతో నగరంలో వర్షపు నీరు నిలిచిపోతుందని, రైల్వే స్టేషన్ రోడ్డు ప్రతి వర్షానికీ ముంపుకు గురవుతోందని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల నాయకులను లక్ష్యంగా చేసుకుని కూటమి ప్రభుత్వం పోలీసుల ద్వారా అక్రమ అరెస్టులు, తప్పుడు కేసులు నమోదు చేస్తోందని భరత్ ఆరోపించారు. మాజీ మంత్రి జోగి రమేష్, కారుమూరి సునీల్, సిదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే విరూపాక్షి తదితరులపై నమోదైన కేసులపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సిపి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ అరెస్టులకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 5న దేవరాపల్లిలో పొగాకు రైతులకు మద్దతుగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటిస్తున్నారని, రైతులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం



చేయాలని పిలుపునిచ్చారు. పొగాకు, వరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. భోగాపురం విమానాశ్రయ నిర్మాణానికి భూసేకరణ, శంకుస్థాపన చేపట్టింది జగన్ ప్రభుత్వమేనని, ఆ ఘనతను వక్రీకరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బిసి జెఏసి ఉభయ రాష్ట్రాల చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు, ఇన్చార్జ్ లు , వివిధ విభాగాల రాష్ట్ర, జిల్లా, సిటిఅధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.




# గేయామృతకు ఎన్ఐఎస్ బాక్సింగ్ కోచ్‌గా గుర్తింపు

## అభినందించిన మంత్రి కింజరాపు అచ్చం నాయుడు

**టెక్కలి ఆగస్టు 3 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలోని బన్ను వాడ గ్రామానికి చెందిన బొడ్డ గేయామృత జిల్లాలో మొదటి ఎన్ ఐ ఎస్ (నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్) బాక్సింగ్ కోచ్ గా గుర్తింపు పొందింది, ఆమెను నిమ్మాడ మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చం నాయుడు అభినందించి సత్కరించారు. టెక్కలి ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంలో తైక్వాండో బాక్సింగ్ క్రీడలో శిక్షణ పొందిన గేయామృత పట్టుదల క్రమశిక్షణ తో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన ప్రతిష్టాత్మక శిక్షణ కార్యక్రమాన్ని పంజాబ్ పటియాల లో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన, గేయామృతను రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చం నాయుడు సాలువా కప్పి మంత్రి కింజరాపు అభినందించారు, గేయామృత కు ప్రోత్సాహాశీ అందించిన తండ్రి బో డ్డ నాగేశ్వరరావు, గురువు నర్సిపురం శేఖర్ ను ప్రత్యేకంగా అభినందించారు, రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి సమగ్ర ప్రోత్సాహకాలు అందిస్తుందని మంత్రి అచ్చం నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బ్లాక్ బెల్ట్ క్రీడాకారిణి పులిబంధ జాస్విక, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ప్రతి రైతు పంట బీమా చేయించుకోవాలి

## ఎమ్మెల్యే కొణతాల

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి నియోజకవర్గం వ్యవసాయ అధికారులతో మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు రైతుల నమోదు అవగాహన కార్యక్రమాలపై అధికారులతో సమర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు వల్ల పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఎంతో ఉపయోగకరమైన పథకం అని ప్రతి రైతు తప్పనిసరిగా ఈ పథకంలో నమోదు చేసు కొని పంట బీమా ప్రయోజనం పొందాలని తక్కువ ప్రేమించడం అధిక భీమా రక్షణ పొందే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తుందని ఈ పథకంలో రైతులు చెల్లించాల్సిన ప్రీమియం ఖరీఫ్ పంటకు బీమా మొత్తం లో రెండు శాతం రవి పంటకు 1.5% వాణిజ్య మరియు ఉద్యాన పంటలకు ఐదు శాతం మాత్రమేనని మిగిలిన ప్రీమియం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయని ఆయన వివరించారు అనకాపల్లి జిల్లాలో ప్రధాన పంట అయిన వరి పంటకు ఎకరాకు రైతు చెల్లించాల్సిన ప్రీమియం 84 రూపాయల మాత్రమే బీమా మొత్తం 42,492 వరకు లభిస్తుందని ఇది బ్యాంకు ఖాతాలో పడుతుందని వారు పేర్కొన్నారు రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పంట బీమా చేయించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు పంట బీమా నమోదు కోసం రైతులు ఆధార్ కార్డు బ్యాంక్ పాస్ బుక్ పట్టాదారు పాసు బుక్కు మొబైల్ నెంబరు మీ సమీప మీసేవ కేంద్రంలో నమోదు చేసుకోవాలని మరింత సమాచారం కోసం సంబంధిత రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారులు ఆశా దేవి అనకాపల్లి మండల వ్యవసాయ అధికారి పి రంగాచారి కసింకోట వ్యవసాయ అధికారి స్వప్న అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకుల ధనలక్ష్మి ఆర్ ఎస్ కే సిబ్బంది ప్రభుత్వ అధికారులు వ్యవసాయ అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు



# ప్రజా సమస్యలు పరిష్కారమే అభివృద్ధికి నిలయాలు

## దేవాలయాలు సాంస్కృతిక కేంద్రాలుగా తయారు కావాలి

**టెక్కలి ఆగస్టు 3 జయ జయహే**

టెక్కలి పుర వీధుల్లో సుదీర్ఘకాలంగా తిష్ట వేసిన ప్రజా సమస్యల పరిష్కారమే ఆసలైన అభివృద్ధిని సాధించగలమని టెక్కలి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు జర్జాన రామ్ జీ అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలోనీ 9,10,పలు సమస్యలను ఆర్డీవో కార్యాలయానికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. 11లైన్లో సచివాలయం భవనములో ఆ సాంఘిక కార్యాకలా పాలు జరుగుతున్న దృష్ట్యా భవనానికి తాళాలు వేసి అక్కడ పరిశుభ్రత పాటించడానికి డస్ట్ బిన్ లు ఏర్పాటు చేయాలని కోరేమన్నారు. దేవాలయాల ప్రాంగణాలను సాంస్కృతిక శిక్షణా కేంద్రాలుగా ఏర్పాటు చేసి సాంప్రదాయమైన కళల ప్రదర్శన కేంద్రాలుగా మార్చాలని మనవి చేశారు,ఈ మేరకు పట్టణంలోని వీధుల్లో త్రాగునీరు, విద్యుత్తులో వోల్టేజి వారి పారిశుధ్యం సమస్యలను తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికార కార్యాలయాలకు వినతి పత్రములను అందజేశారు, ఈ కార్యక్రమంలో జర్జాన రాంజీ, జిల్లా ఉపాధ్యక్షులు నడుకూరు లక్ష్మీనారాయణ, మండల ఉపాధ్యక్షులు ఆకుల ప్రకాష్, తమ్మినేని ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో డిజిటల్ వసతులు
# మెరుగుపరచాలి

(డిజిటల్ గ్రామాలే వికసిత భారతానికి పునాది)

(ప్రతాప్)

**డిజిటల్ సాంకేతికత నేటి ప్రపంచంలో విలాసం కాదు, ప్రాథమిక మౌలిక వసతి. గ్రామాల్లో డిజిటల్ వసతులు మెరుగుపరచడం అభివృద్ధి అవసరం మాత్రమే కాదు, సమాన అవకాశాల ప్రశ్న కూడా. నాణ్యమైన ఇంటర్నెట్, కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ సేవా కేంద్రాలు, పబ్లిక్ వై-ఫై, ఆన్‌లైన్ బ్యాంకింగ్, టెలీమెడిసిన్ వంటి సదుపాయాలు గ్రామాలకు చేరితే విద్య, వ్యవసాయం, ఉపాధి, ఆరోగ్యం, పాలన వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయి. గ్రామీణ--పట్టణ డిజిటల్ అంతరాన్ని తగ్గించకపోతే సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదు.**

దేశంలో డిజిటల్ అనుసంధానాన్ని విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. ప్రస్తుతం దేశంలోని 6.12 లక్షల గ్రామాల్లో 3+/4+ మొబైల్ కనెక్టివిటీ అందుబాటులో ఉంది. అంటే సుమారు 95.15 శాతం గ్రామాలకు మొబైల్ ఇంటర్నెట్ సేవలు చేరాయి. అయితే కనెక్టివిటీ ఉండటం ఒకటి, నాణ్యమైన వేగంతో డిజిటల్ సేవలు అందుబాటులో ఉండటం మరోటి. ఇంకా అనేక గ్రామాల్లో నెట్‌వర్క్ నాణ్యత, వేగం, నిరంతర సేవల విషయంలో లోపాలు కొనసాగుతున్నాయి.

ఈ పరిస్థితిని మెరుగుపరిచేందుకు భారత్‌నెట్ (దీష్టుథీఫ్‌చీవ్) కార్యక్రమం అత్యంత కీలకంగా మారింది. దేశంలోని ప్రతి గ్రామ పంచాయతీకి అధిక వేగం కలిగిన బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించడం దీని లక్ష్యం. 2026 నాటికి సుమారు 2.15 లక్షల గ్రామ పంచాయతీలు ఆప్టికల్ ఫైబర్ బ్రాడ్‌బ్యాండ్‌తో అనుసంధానమయ్యాయి. అలాగే ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ ద్వారా 6.39 కోట్ల మంది గ్రామీణులకు డిజిటల్ అక్షరాస్యత శిక్షణ అందించడం విశేషం. కామన్ సర్వీస్ సెంటర్లు, డిజిటల్ ఇండియా, ఈ-గ్రామ్ స్వరాజ్, ఈ-నామ్, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ వంటి కార్యక్రమాలు గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేస్తున్నాయి.

ఇటీవల ప్రారంభించిన సమృద్ధ్ గ్రామ్ ఫైజిటల్ గ్రామీణ అభివృద్ధిలో మరో వినూత్న అడుగు. డిజిటల్, భౌతిక సేవల సమ్మేళనంగా రూపొందించిన ఈ పథకంలో స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, డిజిటల్ నైపుణ్య శిక్షణ, టెలీమెడిసిన్, డిజిటల్ బ్యాంకింగ్, ఈ-గవర్నెన్స్, పబ్లిక్ వై-ఫై వంటి సదుపాయాలను ఒకే వేదికపై అందించే ప్రయత్నం జరుగుతోంది. ఇది గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ వ్యాపారాలకు కొత్త మార్గాలను తెరుస్తుంది.

గ్రామాల్లో డిజిటల్ వసతులు బలోపేతమైతే విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులు, పోటీ పరీక్షల కోచింగ్, నైపుణ్యాభివృద్ధి కోర్సులను సులభంగా అభ్యసించగలరు. రైతులు వాతావరణ హెచ్చరికలు, మార్కెట్ ధరలు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత, ప్రభుత్వ పథకాల సమాచారాన్ని తక్షణమే పొందగలరు. మహిళలు, స్వయం సహాయక సంఘాలు తమ ఉత్పత్తులను ఈ-కామర్స్ వేదికల ద్వారా విక్రయించగలరు. యువత ఫ్రీలాన్సింగ్, స్టార్టప్‌లు, డిజిటల్ సేవల రంగంలో కొత్త అవకాశాలను అందిపుచ్చుకోగలరు. టెలీమెడిసిన్ ద్వారా నిపుణ వైద్యుల సేవలు దూర ప్రాంతాల ప్రజలకు చేరువవుతాయి. ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారుస్తాయి.

అయితే ఇంకా పరికరాల కొరత, నెమ్మదైన ఇంటర్నెట్, విద్యుత్ అంతరాయాలు, డిజిటల్ అక్షరాస్యత లోపం వంటి సవాళ్లు కొనసాగుతున్నాయి. ప్రతి గ్రామ పంచాయతీలో ఆధునిక డిజిటల్ సేవా కేంద్రం, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, ఉచిత పబ్లిక్ వై-ఫై, మహిళలు, రైతులు, యువత కోసం ప్రత్యేక డిజిటల్ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. గ్రామాల్లో డిజిటల్ మౌలిక వసతులను జాతీయ ప్రాధాన్యతగా అభివృద్ధి చేసినప్పుడే గ్రామాలు కేవలం ఇంటర్నెట్‌తో అనుసంధానమైన ప్రాంతాలుగా కాకుండా, విద్య, ఆరోగ్యం, ఉపాధి, ఆవిష్కరణలు, స్వావలంబనకు కేంద్రాలుగా రూపాంతరం చెందుతాయి. డిజిటల్ గ్రామాల నిర్మాణమే వికసిత భారత్--2047 లక్ష్య సాధనకు నిజమైన పునాది.




## అభివృద్ధి, సంక్షేమము కూటమికి రెండు కళ్ళు

మాడుగుల ఆగస్టు3 జయ జయహే

అభివృద్ధి సంఖ్యామశీ కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు లాంటివని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. సోమవారం మాడుగుల మండలంలో సుమారు 12 కోట్ల రూపాయలు విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన పలుచోట్ల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపేట వేస్తుందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినప్పటికీ చిన్న హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతుందని చెప్పారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ సారాధ్యంలో ఈ రాష్ట్రం అభివృద్ధికి చేస్తున్నారని చెప్పారు. ఈ మాడుగుల, శంకరం,తాటిపర్తి, సాగరం, జాలంపల్లి తదితర గ్రామాలలో సిసి రోడ్లు పాఠశాల ప్రహరీ గోడలు, బ్రిడ్జిలు ప్రారంభోత్సవ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి అప్పలరాజు, పెద్దారు జలాశయ కమిటీ చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు, పలువురు అధికారులు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్ సన్యాసిరావు, పుప్పాల రమేష్, జి రమణ, వెంకటరమణ, పి లక్ష్మీనారాయణ, ఉండూరు దేవుడు తోపాటు మండలంలో గల కూటమి నాయకులు పాల్గొన్నారు

# "సమస్యల పరిష్కారంలో మానసిక శాస్త్ర దృక్పథం"



"సంహరించకూడదు... సంస్కరించాలి" అనే మానవతా తత్వం.

పరిచయం:

జీవితంలో సమస్యలు సహజం. సమస్యలు లేని జీవితం ఉండదు.

కానీ ప్రతి సమస్యను చూసే దృష్టికోణం మాత్రం ఒకేలా ఉండదు. సాధారణ వ్యక్తి సమస్యను ఒక సంఘటనగా చూస్తే, మానసిక శాస్త్రవేత్త దానిని ఒక ప్రక్రియగా, ఒక మానవ అనుభవంగా, ఒక అభివృద్ధి అవకాశంగా పరిశీలిస్తాడు. అందువల్ల సైకాలజిస్ట్ లక్ష్యం తప్పును వెతకడం కాదు; పరిష్కారాన్ని కనుగొనడం.

సైకాలజిస్ట్ దృష్టికోణం ఎందుకు భిన్నంగా ఉంటుంది?

మానసిక శాస్త్ర నిపుణుడు వ్యక్తిని అతని ఒక్క చర్యతో అంచనా వేయడు. అతని ఆలోచనలు, భావోద్వేగాలు, కుటుంబ పరిస్థితులు, సామాజిక ప్రభావాలు, వ్యక్తిత్వ లక్షణాలు, గత అనుభవాలు వంటి అనేక అంశాలను సమగ్రంగా పరిశీలిస్తాడు.

అతని ప్రధాన ప్రశ్న:

"ఈ వ్యక్తి ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నాడు?"

అనే దానిపైనే ఉంటుంది. తీర్పు ఇవ్వడం కంటే అర్థం చేసుకోవడానికే అతను ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాడు.

షరతులు లేని సానుకూల గౌరవం :

మానవతావాద మనోవిజ్ఞానంలో ప్రముఖమైన ఈ భావనను ప్రతిపాదించారు.

ఈ సూత్రం ప్రకారం ప్రతి వ్యక్తి గౌరవానికి అర్హుడు. అతని ప్రవర్తనలో లోపాలు ఉన్నా, వ్యక్తిగా అతని విలువ తగ్గదు. వ్యక్తిని తిరస్కరించడం కాదు; అతని హానికరమైన ప్రవర్తనను సరిదిద్దడం లక్ష్యం.

ఇది కౌన్సెలింగ్, సైకోథెరపీ మరియు వ్యక్తిత్వ వికాసంలో అత్యంత ప్రాధాన్యమైన మార్గదర్శక సూత్రంగా పరిగణించబడుతుంది.

"సంహరించకూడదు... సంస్కరించాలి" -- మానసిక శాస్త్ర తత్వం

ఒక వ్యక్తి చేసిన తప్పుకు శిక్ష అవసరమయ్యే సందర్భాలు ఉండవచ్చు. అయితే కేవలం శిక్షతోనే సమస్యలు శాశ్వతంగా పరిష్కారం కావు.

మానసిక శాస్త్రం చెప్పేది:

తప్పును ఖండించాలి.

వ్యక్తిని అర్థం చేసుకోవాలి.

మార్పుకు అవకాశం కల్పించాలి.

పునరావాసానికి సహకరించాలి.

సమాజ అభివృద్ధి ప్రతీకారంతో కాదు; సంస్కరణతో సాధ్యమవుతుంది.

### సమస్యల పరిష్కారానికి మూడు ప్రాథమిక సూత్రాలు

1. సమస్యకు మూల కారణాన్ని గుర్తించాలి

ప్రతి సమస్య వెనుక ఒక కారణం ఉంటుంది. కనిపించే లక్షణాలపై కాకుండా, అసలు కారణంపై దృష్టి పెట్టాలి.

మూల కారణాలు కావచ్చు:

కుటుంబ విభేదాలు

భావోద్వేగ నియంత్రణ లోపం

ఒత్తిడి

అపార్థాలు

సామాజిక లేదా ఆర్థిక పరిస్థితులు

వ్యక్తిత్వ సమస్యలు

కారణాన్ని గుర్తించకుండా చేసే పరిష్కారం తాత్కాలికమే.

2. సమస్య ప్రభావాన్ని సమగ్రంగా అంచనా వేయాలి

ఒక సమస్య కేవలం ఒక వ్యక్తిని మాత్రమే ప్రభావితం చేయదు.

దాని ప్రభావం:

కుటుంబంపై...

పిల్లలపై...

ఉద్యోగంపై...

స్నేహ సంబంధాలపై...

సమాజంపై...

మానసిక ఆరోగ్యంపై...

ఎలా పడుతుందో అర్థం చేసుకోవాలి.

సమగ్ర అవగాహన ఉన్నప్పుడే సరైన పరిష్కారం సాధ్యమవుతుంది.

3. వ్యక్తిగత అసూయ, ద్వేషాలకు అతీతంగా పరిష్కారాన్ని వెతకాలి

నిర్ణయాలు భావోద్వేగాల ఆధారంగా కాకుండా, వాస్తవాల ఆధారంగా ఉండాలి.

దీనికి అవసరమయ్యేవి:

నిష్పాక్షికత

సహానుభూతి

సంభాషణ

పరస్పర గౌరవం

న్యాయబద్ధమైన ఆలోచన

వ్యక్తిగత కక్షలు సమస్యను మరింత క్లిష్టం చేస్తాయి.

మనిషికి అత్యంత విలువైన సంపదలు:

మనిషి జీవితంలో ధనం, హోదా, అధికారాల కంటే విలువైనవి కొన్ని ఉన్నాయి.

అవి:

తన సమయం

మనశ్శాంతి

ఆరోగ్యం

కుటుంబ అనుబంధం

సత్సంబంధాలు

పరస్పర విశ్వాసం

ఆత్మగౌరవం

వీటిని కోల్పోయి పొందిన విజయం కూడా సంపూర్ణ విజయంగా పరిగణించబడదు

మానసిక శాస్త్రం చెప్పే జీవన సందేశం:

సమస్యను చూసి భయపడకూడదు.

వ్యక్తిని చూసి ద్వేషించకూడదు.

సమస్యను విశ్లేషించాలి.

"వ్యక్తిని అర్థం చేసుకోవాలి.

పరిష్కారాన్ని నిర్మించాలి.

అదే నిజమైన మానవతా దృక్పథం.

### ముగింపు:

మానసిక శాస్త్రం మనకు ఒక గొప్ప జీవన సత్యాన్ని నేర్పుతుంది. ప్రతి సమస్య వెనుక ఒక కారణం ఉంటుంది. ప్రతి తప్పు వెనుక ఒక అనుభవం ఉంటుంది. ప్రతి మనిషిలో మార్పు సాధ్యమే.

అందుకే సమస్యలను పరిష్కరించే ప్రతి ప్రయత్నం మానవతా విలువలు, సహానుభూతి, శాస్త్రీయ ఆలోచన మరియు నిష్పాక్షిక దృక్పథంతో సాగాలి.

"మనిషిని శిక్షించడం కంటే, అతనిలోని మంచితనాన్ని మేల్కొలపడం గొప్పది. సంహారం సమాజాన్ని భయపెడుతుంది; సంస్కరణ సమాజాన్ని అభివృద్ధి చేస్తుంది."

డాక్టర్ జి .రాజేశ్వరరావు
ఫ్యాకల్టీ అఫ్ సైకాలజీ
ఆంధ్ర యూనివర్సిటీ



# చౌడేశ్వరి కథ.. దేవాంగుల కుల దేవత





## చౌడేశ్వరి (పార్వతీదేవి )

ఆషాడ బహుళ అమావస్య

ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా...

చౌడేశ్వరి అమ్మవారు శక్తి స్వరూపిణి. ముఖ్యంగా కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో "చౌడమ్మ తల్లి" గా పూజలు అందుకుంటుంది.

### చౌడేశ్వరి ఎవరు?

చౌడేశ్వరి = చౌడి ం ఈశ్వరి = "శక్తికి ఈశ్వరి"

ఆమె దుర్గాదేవి యొక్క ఉగ్ర రూపం. గ్రామాలను, రైతులను, ఆడవాళ్లను కాపాడే కులదైవం గా చాలా మంది నమ్ముతారు.

ప్రధాన కథ – చౌడేశ్వరి

పూర్వం ఒక ఊరిలో రాక్షసులు ప్రజలను చాలా హింసించేవారు. పంటలు నాశనం చేసేవారు, ఆడవాళ్లను బాధపెట్టేవారు.

ఊరి ప్రజలు అందరూ కలిసి అమ్మవారిని ప్రార్థించారు.

అప్పుడు పరాశక్తి చౌడేశ్వరి రూపంలో అవతరించింది.

### ఆమె లక్షణాలు:

– చేతిలో త్రిశూలం, ఖడ్గం

– ఎర్ర చీర, నుదుట కుంకుమ

– సింహ వాహనం పై ఉంటుంది

ఆమె ఆ రాక్షసులను సంహరించి ఊరిని కాపాడింది. అప్పటి నుండి ప్రజలు ఆమెను "గ్రామ దేవత" గా పూజించడం మొదలుపెట్టారు. ప్రసిద్ధ కథ – "భక్తురాలి కథ"లి

ఒక పేద భక్తురాలు ప్రతి రోజు చౌడమ్మ గుడికి వెళ్లి పూలు, కుంకుమ సమర్పించేది. ఒకసారి ఊరిలో కరువు వచ్చింది.

ఆ భక్తురాలు "అమ్మా నీవే దిక్కు" అని 41 రోజులు ఉపవాసం చేసింది.

41వ రోజు చౌడేశ్వరి కలలో కనిపించి "రేపు ఉదయం నీ ఇంటి ముందు కుండ నిండా ధాన్యం ఉంటుంది" అని చెప్పింది.

మరుసటి రోజు నిజంగానే ధాన్యం దొరికింది. అప్పటి నుండి "కోరిన కోర్కెలు తీర్చే తల్లి" అని పేరు వచ్చింది.

### చౌడేశ్వరి పూజ ప్రత్యేకతలు

– రోజు: మంగళవారం, శుక్రవారం, అమావాస్య

– నైవేద్యం: పొంగల్, పులిహోర, కుంకుమ, గాజులు, చీర

– ప్రసాదం: చౌడమ్మ తల్లి గుడిలో "కుంకుమ ప్రసాదం" చాలా పవిత్రం

– ప్రార్థన: "ఓం శ్రీ చౌడేశ్వర్యై నమః"

ఆమెను మొక్కితే ఆరోగ్యం, సంతానం, వ్యాపారం, గృహ శాంతి కలుగుతుందని నమ్మకం.

"చీకటిని పోగొట్టి, ఊరికి వెలుగు ఇచ్చే తల్లి – శ్రీ చౌడేశ్వరి"

చౌడేశ్వరి అమ్మవారి ఆవిర్భావానికి సంబంధించి 2-3 ప్రసిద్ధ కథలు ఉన్నాయి:

### శక్తి ఆవిర్భావ కథ

పూర్వం దుర్గముడు అనే రాక్షసుడు లోకాలను హింసిస్తున్నాడు. దేవతలందరూ కలిసి ఆదిపరాశక్తిని ప్రార్థించారు.

అప్పుడు పరాశక్తి "చౌడేశ్వరి" రూపంలో ఆవిర్భవించింది.

"చౌ" అంటే "నాలుగు" – నాలుగు దిక్కులను, నాలుగు వేదాలను కాపాడే తల్లి కాబట్టి "చౌడేశ్వరి" అని పేరు వచ్చింది.

ఆమె త్రిశూలంతో దుర్గముడిని సంహరించి ధర్మాన్ని నిలబెట్టిందిఎ

### గ్రామ రక్షణ కోసం ఆవిర్భావం

ఒకసారి ఒక గ్రామంలో కరువు, రోగాలు, రాక్షసుల బాధలు ఎక్కువయ్యాయి.

ఊరి పెద్దలు 7 రోజులు యాగం చేసి అమ్మవారిని వేడుకున్నారు.

8వ రోజు తెల్లవారుజామున వేప చెట్టు కింద స్వయంభూగా విగ్రహం ప్రత్యక్షమైంది.

ఆమె నుదుట కుంకుమ, చేతిలో ఆయుధాలు, చుట్టూ తేజస్సు.

ఆ రోజు నుండే ఆమెను "గ్రామ చౌడేశ్వరి" గా పూజించడం మొదలైంది.

అందుకే చాలా ఊర్లలో చౌడేశ్వరి గుళ్లు వేప చెట్టు కిందే ఉంటాయి.

### పార్వతి అవతార కథ

శివపురాణం ప్రకారం – పార్వతీదేవి భక్తులను కాపాడడానికి "ఉగ్ర చండీ" రూపం ధరించింది.

ఆ రూపానికే "చౌడేశ్వరి" అని పేరు.

"చండ" ం "ఈశ్వరి" = చౌడేశ్వరి

### స్వయంభూ:

చాలా చౌడేశ్వరి గుళ్లలో విగ్రహం స్వయంగా వెలిసింది అంటారు

2. కులదైవం: దేవాంగ,కాపు, బలిజ, రెడ్డి, గౌడ కులాల వారికి కులదైవంగా పూజ

3. శక్తి పీఠం: ఆమెను "సప్త మాతృకలలో" ఒకరిగా కూడా భావిస్తారు

"అధర్మం పెరిగినప్పుడు, భక్తుల రక్షణ కోసం ఆదిశక్తి చౌడేశ్వరిగా ఆవిర్భవించింది"

ఏ. బాల సౌజన్య కుమారి,నంది అవార్డు గ్రహీత
తెలుగు ఆచార్యులు, ప్రవచన కర్త
ఆధ్యాత్మిక వేత్త, అనకాపల్లి

# మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం

**కాలుష్య నియంత్రణ మండలి ఈఈ బి.కరుణశ్రీ**

**శ్రీకాకుళం. (జయ జయహే )**



పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకుణ్ణి పూజిద్దామని, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, శ్రీకాకుళం ఈఈ బి.కరుణశ్రీ పిలుపునిచ్చారు. స్థానిక దూదివారి దేవాలయం ఎదురుగా, చిన్న బజార్ గణేష్ యూత్ ఆధ్వర్యంలో సుమారు 30 అడుగుల మట్టి వినాయకుణ్ణి నవరాత్రులలో భాగముగా ప్రతిష్టించనున్నారు. ఇందులో భాగముగా ముఖ్య అతిధిగా కాలుష్య నియంత్రణ ఈఈ బి.కరుణశ్రీ పాల్గొని, భూమి పూజ అనంతరం మాట్లాడుతూ గణేష్ చతుర్థి సందర్భంగా పర్యావరణ హితమైన మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని, పర్యావరణ పరిరక్షణ భాగంగా నదులు, చెరువులు, సముద్రతీరాలు రసాయన విగ్రహాల వల్ల కలుషితం కాకుండా చూడటం మన అందరి బాధ్యతన్నారు. ప్రజలకు పర్యావరణ హితం ఏదో తెలియజేసి, మట్టి వినాయకుల వాడకంపై అవగాహన రావాలని, ప్లాస్టిక్ రహిత పండుగ కాబట్టి.. క్లాత్ బ్యాగ్ల పంపిణీ ద్వారా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పండుగ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ భాగం గనుక సహజ మట్టి వినాయకుడి ద్వారా పూర్వ సంప్రదాయాలను తిరిగి తీసుకు రావాలని, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి శ్రీకాకుళం ప్రాంతీయ కార్యాలయం వారు కూడా మట్టి ప్రతిమలను అందించనున్నామన్నారు. విశిష్ట అతిధి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు లయన్ నటుకుల.మోహన్ మాట్లాడుతూ మట్టి వినాయక ప్రతిమలను వాడటం కేవలం ఒక పూజా విధానం మాత్రమే కాదని, అది పర్యావరణానికి ఇచ్చే రక్షణ అని, పురాణాల్లో చెప్పినట్లే పసుపు వినాయకుడు, మట్టి వినాయకుడు శుభం అని, పాపనాశనం కలిగించే దైవస్వరూపాలన్నారు. ప్రతీ సంవత్సరం లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను అందిస్తున్నామని, పర్యావరణ పరిరక్షణలో అందరం భాగమౌదామని పిలుపునిచ్చారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో బెస్ట్ క్లిక్ సంతోష్, సత్తివాడ.రాజేష్, ముక్కాల.పురుషోత్తం, నందిగామ.ప్రసన్న కుమార్, ఓలివన్.భాను, ఎస్ఆర్ఎం.మనోహర్, చిన్న బజార్ గణేష్ యూత్ బృందం పాల్గొన్నారు.



## ప్రజలపై ఆర్థిక భారం తగ్గించడమే లక్ష్యం

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం జయ జయహే:**

ఆగస్టు 3 ప్రజలపై నిత్యావసరాల ఆర్థిక భారం తగ్గించి ప్రతి కుటుంబానికి ఊరట కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాజమహేంద్రవరం సిటి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక తుమ్మలోవ రైతు బజార్లో సోమవారం బిపిడి బియ్యం ధరల తగ్గింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్టీమ్ బిపిడి బియ్యం ధరను కిలోకు రూ.62 నుంచి రూ.52కు, బిపిడి బియ్యం ధరను రూ.58 నుంచి రూ.50కు తగ్గించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 115 రైస్ బజార్ కేంద్రాలు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యక్ష విక్రయ కేంద్రాల్లో ఈ ధరలకు బియ్యం అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ నిర్ణయంతో పేద, మధ్యతరగతి కుటుంబాల నెలవారీ ఖర్చు తగ్గుతుందని పేర్కొన్న ఎమ్మెల్యే, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వందశలవారీగా అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం తుమ్మలోవ పరిసర ప్రాంతాల్లో డోర్ టూ డోర్ కార్యక్రమం నిర్వహించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, రైతు బజార్ సిబ్బంది, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏచూరి నగర్‌ను గుర్తించండి: సిపిఎం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 03,జయ జయహే**




వెంకటగిరి నియోజకవర్గం పెట్లూరు పంచాయతీలోని సీతారాం ఏచూరి నగర్ ను ప్రభుత్వం గుర్తించి అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని ఆ నియోజకవర్గ సిపిఎం కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద సోమవారం సీతారాం ఏచూరి నగర్ వాసులతో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చెంగయ్య మాట్లాడుతూ ఏచూరి కాలనీ ఏర్పడి మూడేళ్లు దాటినా ఇప్పటివరకు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటి పట్టాలు, విద్యుత్ సర్వీసులు, గుర్తింపు కార్డులు లేక నిమ్న వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. స్థానిక కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన విద్యుత్ శాఖ ఏఈ ఇంటికో లైటు కూడా లేకుండా సరఫరా నిలిపేశాడని మండిపడ్డారు. ప్రభుత్వం పేదలకు కరెంట్ ఉచితమని చెప్తున్నా, అతిగా వ్యవహరించిన ఏఈపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా షికారీల కుటుంబాలకు గుర్తింపు కార్డులు, పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, కేశవమ్మ తదితరులు పాల్గొన్నారు.



## గింజర్తిలో తరగతుల తొలగింపుపై విద్యార్థులు, గ్రామస్తుల నిరసన

**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్ ఆగష్టు 04,**

అల్లూరి జిల్లా,కొయ్యూరు మండలంలో హృదయాన్ని కలిచివేసే సంఘటన చోటు చేసుకుంది.గింజర్తి ఎంపీపీ పాఠశాలలో 3, 4, 5 తరగతులను తొలగించడాన్ని నిరసిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు సోమవారం ఎంఈఓ కార్యాలయం ముందు టెంట్ వేసి నిరసన చేపట్టారు.లోకేష్ మామయ్య మాకు చదువుకోవడానికి మా గ్రామంలో స్కూలు ఏర్పాటు చేయండి" అంటూ చిన్నారులు కన్నీటితో ఆవేదన వ్యక్తం చేశారు. తరగతులు తొలగించడం వల్ల సుమారు 70 మంది చిన్న పిల్లలు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉ ందని గ్రామస్తులు ఆవేదన చెందారు. పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు క్లాసులను యథాతథంగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.ఈ నిరసనలో సుమారు 70 మంది గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి తొలగించిన తరగతులను పునరుద్ధరించాలని, పేద గిరిజన పిల్లల భవిష్యత్తుతో చెలగాటం వద్దని నిరసనకారులు కోరారు.



## శ్రీ పల్లికొండేశ్వరస్వామిని దర్శించుకున్న టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు

**ఆలయ అభివృద్ధిపై వినతిపత్రం అందజేసిన కూరపాటి శంకర్ రెడ్డి**

**సత్యవేడు, ఆగస్టు 03,జయ జయహే.**

తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బి.ఆర్. నాయుడు కుటుంబ సమేతంగా సోమ వారం సత్యవేడు నియోజకవర్గంలోని ప్రముఖ శైవక్షేత్రమైన సురుటుపల్లి శ్రీ పల్లికొండేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.టీటీడీ చైర్మన్‌కు నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.ఆలయ చైర్మన్, ఈఓ, అధికారులు, సిబ్బంది వేదమంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు బి.ఆర్. నాయుడు దంపతులను ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.దర్శనం అనంతరం ఆలయ చైర్మన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సురుటుపల్లి ఆలయ అభివృద్ధిపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆలయానికి ప్రహరీ గోడ నిర్మాణం, 75 కిలోవాట్ల సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, నవరాత్రి ఉత్సవాల్లో పూల అలంకరణ కోసం రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి, ఆలయ చైర్మన్ పద్మనాభరాజు సంయుక్తంగా టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడికి వినతిపత్రం అందజేశారు.ఆలయ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తానని టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు హామీ ఇచ్చారు.అనంతరం బి.ఆర్. నాయుడు కుటుంబ సమేతంగా నాగలాపురంలోని శ్రీ వేదనారాయణస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



## మరిదడిమాంబ ఆలయానికి విరాళం

**మునగపాక ఆగస్టు 3 జయ జయహే**

మునగపాక, మండలంలోని టి సిరిసపల్లి గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి ఆలయ నిర్మాణానికి కరణం శ్రీనివాసరావు ఉమా రాజేశ్వరి దంపతులు విరాళం అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎంపీటీసీ మద్ద మద్దాల వీరు నాయుడు తదితరులు పాల్గొన్నారు

## స్వచ్ఛ మునగపాకకు శ్రీకారం

**మునగపాక, జయ జయహే**




మండల కేంద్రం మునగపాక లో గల రాష్ట్రంలోనే పేరు తెచ్చుకున్న గ్రామీణ యువజన ఆధ్వర్యంలో మరో సేవా కార్యక్రమానికి గ్రామీణ యువజన మందిరం పిలుపునిచ్చింది గ్రామంలోని యువకులు మహిళలు రైతులు వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛత సేవా సంస్థ ప్రతినిధులు తో కలిసి మునగపాక గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేనికి నిర్ణయం తీసుకున్నారు ఈ మేరకు గ్రామంలోని అందర్నీ కలుపుకొని అధికారులు పంచాయితీ సిబ్బంది మండల సిబ్బంది ప్రజాప్రతినిధులు కలుపుకొని మునగపాక గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కమిటీ గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడు ఆర్డర్ శ్రీకాంత్ తెలిపారు గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ఈ స్వచ్ఛ గ్రామాన్ని తీర్చిదిద్దడానికి అందరూ సహకరించాలని కమిటీ నెంబరు మల్ల జోగారావు సూచించారు గ్రామీణ యువజన మంద గ్రామీణ యువజన మందులు నిర్ణయాన్ని గ్రామస్తులు స్వాగతించారు




## నాగులపల్లిలో తల్లిపాల వారోత్సవాలు

**మునగపాక, జయ జయహే**

మండలంలోని నాగులపల్లి గ్రామంలో గల అంగన్వాడి కేంద్రం మూడు పరిధిలో తల్లిపాలు వారోత్సవాలను సోమవారం నిర్వహించారు ఈ సందర్భంగా పిల్లల పౌష్టికాహారం గురించి అంగన్వాడీ టీచర్ ఎం పద్మావతి వివరించారు ఈ నెల ఒకటో తేదీ నుండి 7వ తేదీ వరకు తల్లిపాల ప్రాధాన్యత వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమం వివరిస్తూ తల్లిదండ్రులకు మహిళలకు అంగన్వాడీ పిల్లలకు పోషకాహార ప్రాధాన్యత తల్లిపాల ప్రాధాన్యత గురించి వివరించడం జరుగుతుందని ఆమె తెలిపారు.




## నేడు ఇసుకపల్లిలో ధార్మిక కార్యక్రమాలు

**డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తి.తి.దే.**

**ఇసుకపల్లి (జయ జయహే)**

తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో శిరివెళ్ళ మండలం, ఇసుకపల్లి గ్రామంలోని శ్రీ శివరామాలయం నందు మంగళవారం నుండి శనివారం వరకు ప్రతిరోజు సాయంత్రం 6-00 గం. నుండి మూడు రోజు ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన, శనివారం భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు విల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఎందుకు సంబంధించిన కరపత్రాలను స్థానిక భక్త సమాజంతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్త సమాజం సభ్యులు కొత్తపు నరసింహారెడ్డి, లింగాల వెంకట నారాయణ రెడ్డి, ఎన్. వెంకట సుబ్బారెడ్డి, యం.వెంకటశివుడు యాదవ్, ఎన్. శ్రీనివాసులు యాదవ్, ఎల్. వెంకటేశ్వర్లు యాదవ్, పి. రమణమూర్తి యాదవ్, కె. సుబ్రహ్మణ్యం, కె. సుబ్రహ్మణ్యం శెట్టి, యం. వెంకటేశ్వర్లు యాదవ్, కె. పుల్లమ్మ, కె. పార్వతి, ఎన్. రాములమ్మ, యం. రామలక్ష్మమ్మ, ఎన్. లక్ష్మిదేవి, పి. చిన్న లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు నిర్ణయంతో ఉత్తరాంధ్ర నిరుద్యోగ యువతకి అన్యాయం: భీశెట్టి బాబ్జి

**విశాఖపట్నం ఆగస్టు 3:(జయ జయహే)**




రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు ని అమరావతిలో ఏర్పాటు చెయ్యాలని కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖ రాయడం వలన ఉత్తరాంధ్ర లోని నిరుద్యోగ యువతకి తీరని అన్యాయం జరుగుతుందని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు లోక్ సత్తా విశాఖ నగరశాఖ అధ్యక్షుడు ఎమ్. ఎస్.ఎన్.మూర్తి అధ్యక్షతన సోమవారం ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీ లో జరిగిన రౌండ్ టేబిల్ సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న భీశెట్టి బాబ్జి మాట్లాడుతూ రైల్వే జోన్ విశాఖపట్నం లో ఉంటే రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు ని అమరావతిలో ఏర్పాటు చెయ్యాలని చంద్రబాబు కేంద్ర ప్రభుత్వాన్ని ఎలా కోరుతారని రైల్వే జోన్ ఉన్నచోటే బోర్డు ఉంటుందని చంద్రబాబు కి తెలియదా అని ప్రశ్నించారు, ఉత్తరాంధ్ర నిరుద్యోగ యువత కి అన్యాయం జరగ కూడదని లోక్ సత్తా విశాఖ నగర శాఖ ఆధ్వర్యంలో అన్ని ప్రజాసంఘాలతో రౌండ్ టేబిల్ సమావేశం ఏర్పాటు చేసిందని ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలు రాష్ట్ర ప్రభుత్వం పై వత్తిడి తేవాలని భీశెట్టి అన్నారుఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర నేత జే. వి.వి. సత్యనారాయణ మూర్తి, ప్రముఖ న్యాయవాది నర్రా లోకనాధరావు, ఉత్తరాంధ్ర ఫ్యాఫ్ అధ్యక్షురాలు డాక్టర్ సుగునేశ్వరి, సీనియర్ పాత్రికేయుడు శివశంకర్ ప్రసంగించారు ,కార్యక్రమం లో ప్రజా సంఘాల ప్రతినిధులు వడ్డాది ప్రకాష్, వేగి శ్రీనివాస్,మరుపల్లి పైడిరాజు, తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్. మళ్ళ కుమార్,సన్యాసి రావు, గాయకుడు దేవిశ్రీ, గిరిజన నాయకుడు విశ్వేశ్వర్రావు, మాజీ కార్పొరేటర్ ఆనందరావు, గొట్టాపు సుదీర్,మాజీ నేవి అధికారి రొంగలి ఎర్నయుడు,ఏయూ విద్యార్థి నాయకుడు రమణమూర్తి,ఉ మ్మిడి గణేష్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీకాళహస్తిలో అభివృద్ధికి నోచుకోని దళితవాడలు

**శ్రీకాళహస్తి రూరల్, ఆగస్టు 03,జయ జయజయహే**




శ్రీకాళహస్తి మండలం లోని కొన్ని దళిత వాడలు అభివృద్ధికి నోచుకోలేదని ఇంకా కులవివక్షత కొనసాగుతోందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు గంధం మణి అన్నారు. గత కొద్ది రోజులుగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో సామాజిక సర్వే- పల్లె నిద్ర కార్యక్రమం ద్వారా అనేక గ్రామాల్లో సంచరించటం జరిగుతోంది . దళిత కాలనీలలో ఉన్న ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలంటూ సోమవారం శ్రీకాళహస్తి మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించడంతోపాటు మండల తాసిల్దార్ సుబ్రహ్మణ్యం కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలంలో ఉన్న పెంకులపాడు, తొండమానాపురం, ఎగువ వీధి, కమ్మ కొత్తూరు, పెనుబాక, జింగిలిపాలెం, ఊరందూరు గ్రామాల్లోని దళిత కాలనీల్లో ఉన్న సమస్యలను చూస్తుంటే దళితులు పట్ల పాలకులకు ఎంత మాత్రం చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థమవుతుందని అన్నారు. కమ్మ కొత్తూరు, పెనుబాక, తొండమనాడు దళిత కాలనీ వాసులకు స్మశాన భూమిని కేటాయించాలని అన్నారు. అలాగే తొండమనాడు హరిజనవాడలో నివసిస్తున్న యువత ఊరిలో ఉన్న రచ్చబండ మీద కూర్చుంటే గొడవకు వచ్చిన సంఘటనలు దళితుల పట్ల చూపిస్తున్న అంటరానితనానికి అర్థం పట్టేలా ఉన్నాయని మండిపడ్డారు. అలాగే ఎగువ వీధి గ్రామంలో చెత్తను సేకరించేవారు ముగ్గురిలో ఒకరు దళిత వర్గానికి చెందిన వారు ఉండగా దళిత హరిత రాయబారి దళితుల కాలనీలోని చెత్తను మాత్రమే సేకరించాలని గ్రామంలో సేకరించటానికి వీల్లేదని అక్కడి నాయకుడు చెబుతుండటం దళితుల పట్ల వివక్ష చూపించడం కాక మరి ఏమిటని ప్రశ్నించారు. అలాగే జింగిలిపాలెం గ్రామంలో గ్రామదేవత పొంగళ్ళు పెట్టుకునే సమయంలో ఊర్లో వాళ్ళు పొంగళ్ళు పెట్టుకునే దగ్గర దళితులు పొంగళ్ళు పెట్టకూడదనే నిబంధనను వివక్ష అని కాక మరి ఏ పేరు పెట్టమంటారని అన్నారు. ఊరందూరు హరిజనవాడలో నివసించే వారికి స్మశానానికి దారి లేక ఎంతో వ్యయ ప్రయాసల మధ్య దహన క్రియలు పూర్తి చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి దళిత కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని పోరాటాలు ఉధృతం చేయాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డిపల్లి సురేష్, వెంకటేష్, ఎస్.ఎఫ్.ఐ గురవయ్య, రాధమ్మ, మూర్తి, ఈశ్వర్, ఉస్మాన్, సుబ్రహ్మణ్యం, రవి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు తక్కువ ధరలకే సన్న బియ్యం

**సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం.**

**సత్యవేడు, ఆగస్టు 03,జయ జయహే.**

రాష్ట్రంలోని పేద నిరుపేద ప్రజలకు తక్కువ ధరలకే సన్న బియ్యం అందించాలన్న కూటమి ప్రభుత్వం హామీలో భాగంగా సత్యవేడు నియోజకవర్గం నారాయణవనం మండల కేంద్రంలోని గణేష్ మోడరన్ రైస్ మిల్లులో సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం ప్రారంభించారుఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్న ప్రజలకు అధిక ధరలకు అందుతున్న బియ్యానికి బదులుగా కూటమి ప్రభుత్వం ఆయా రైస్ మిల్లుల ద్వారా తక్కువ ధరలకు సన్నబియ్యం అందించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారుప్రస్తుతం మార్కెట్లో 26 కేజీల సన్న బియ్యం 1550 నుంచి 1600 రూపాయలు ధర పలుకుతుందన్నారుఅయితే ప్రభుత్వం నిర్ణయించిన కేంద్రాల ద్వారా కిలోపైన రూ 10 తగ్గించి సన్న బియ్యం, బుడ్డ బియ్యమును అందించడం జరుగుతుందన్నారు.ఈ సన్న బియ్యం ఒక రేషన్ కార్డు కి ఒక నెలకి సంబంధించి 26 కిలోల బస్తాను మాత్రమే అందించడం జరుగుతుందన్నారు.ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. అంతకుముందు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ను గణేష్ రైస్ మిల్ యజమాని కేజీ లక్ష్మణన్ సత్కరించారు.కార్యక్రమంలో తాహసిల్దార్ భార్గవి సివిల్ డిప్యూటీ తాహసిల్దార్ హరినాథ్ ఆర్ ఐ అంజనమ్మ పిచ్చాటూరు తెలుగుదేశం పార్టీ నాయకులు ఇలంగోవ రెడ్డి ఎస్ ఎం సురేష్ స్థానిక నాయకులు కుట్టి బాలయ్య డిఆర్ ముగం వి సుబ్రహ్మణ్యం దేవరాజులు నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.



## దాసుకుప్పం డ్రైనేజీ నిర్మాణ పనులనులను పరిశీలించిన అధికారులు

**సత్యవేడు, ఆగస్టు 03,జయ జయహే**

మండలంలోని దాసుకుప్పం గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులను అధికారులు పరిశీలించారు.సోమవారం స్థానిక ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల పరిషత్ ఏవో త్రివిక్రమరావు, ఆర్డబ్ల్యూఎస్ డీఈ శైలజ,ఏఈ వింధ్య తదితరులు బృందం దాసుకుప్పం గ్రామంలో చేపట్టిన మురుగుకాల్వల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటేశులు మాట్లాడుతూ పారిశుద్ధ్యంలో భాగంగా మురుగుకాలువల నిర్మాణాలగాను పీఎంఏజీవై పథకంలో మూడు పనులకు నిధులు మంజూరు అయిందన్నారు.ఒక్కో డ్రైనేజీ నిర్మాణానికి గాను నాలుగు లక్షల 90 వేల రూపాయలు మొత్తం 14 లక్షల 70 వేల రూపాయలు విడుదల అయిందన్నారు.ఈ నిధులను వెచ్చించి దాసుకుప్పం పంచాయతీ కార్యాలయం నుంచి చెన్నేరి వరకు డ్రైనేజీ నిర్మాణాలను పూర్తి చేస్తామని ఆర్డబ్ల్యూఎస్ డీఈ శైలజ పేర్కొన్నారు.ఇక్కడ డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి అయితే పారిశుద్ధ్యం గణనీయంగా మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో గుత్తేదారుడు జగన్నాధ రెడ్డిపాల్గొన్నారు.

## ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని పరిశీలించిన బొజ్జల బృందమ్మ

**శ్రీకాళహస్తి, ఆగస్టు 03,జయ జయహే.**



శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించి పరిశీలించారు.ఆసుపత్రి పరిశుభ్రత ను ఆమె స్వయంగా పరిశీలించారు. రోగులకు, వారి బంధువులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆసుపత్రి ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు.



## ఈతకు వెళ్లి యువకుడు మృతి

**వరదయ్యపాలెం, ఆగస్టు, 03,జయ జయహే**

మండలంలోని చిన్నపాండూరు పంచాయతీ పరిధిలో ఓ బావి వద్ద స్నేహితులతో ఈతకు సురేష్ (22)అనే యువకుడు మృతి చెందాడు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని వెలికి తీయించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.



## మాతమ్మను దర్శించుకున్న ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్

**తొట్టంబేడు, ఆగస్టు 03,జయ జయహే.**

తోట్టశీబేడులో మాతమ్మ జాతర సందర్భంగా అగ్నిగుండం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. ముందుగా గ్రామ పెద్దలు అంజూరు తారక శ్రీనివాసులకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మాతమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవార శేష వస్త్రముతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీవారి సురేష్, మొగరాల గణేష్,సెన్నీరు కుప్పం శేఖర్,ఈశ్వర్ సాయి, సోము, ధన, సతీష్, జ్ఞాన కుమార్,వెంకీ,రవి, మల్లీ, విజయ్, భార్గవ్, జయ, అశోక్, వెంకటేష్ నాగార్జున,చెందు, మురళీ,పెద్ద మనుషులు వెంకట రత్నం, సుబ్రమణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

## “అంగన్‌వాడీ పోస్టు.. ముడుపుల మంట!”

**స్థానికులను కాదని స్థానికేతర మహిళకు ఉద్యోగం..**

**ఐసీడీఎస్ అధికారులపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు...**

**కొయ్యూరు (జయ జయహే ) న్యూస్ ఆగస్టు 4,**



అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం నడింపాలెం గ్రామంలో అంగన్‌వాడీ ఆయా పోస్టు భర్తీ ప్రక్రియ తీవ్ర వివాదాస్పదంగా మారింది. నిబంధనలను తుంగలో తొక్కి అర్హులైన స్థానిక గిరిజన మహిళలను పక్కనబెట్టి స్థానికేతర మహిళకు ఉద్యోగం కల్పించారని బాధిత అభ్యర్థులు ఐసీడీఎస్ అధికారులపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నియామకంలో భారీ అక్రమాలు జరిగాయని, అధికారులకు ముడుపులు అందాయనే అనుమానం వ్యక్తం చేస్తూ వారు పత్రికా ప్రకటన విడుదల చేశారు.బాధిత అభ్యర్థుల కథనం ప్రకారం, అంగన్‌వాడీ ఆయా పోస్టుకు స్థానిక అభ్యర్థులకే ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా, పోటుకూరి రమణి ను నిబంధనలకు విరుద్ధంగా ఎంపిక చేశారని ఆరోపించారు.స్థానిక గిరిజన మహిళలకు న్యాయం చేయకుండా, స్థానికేతర మహిళకు ఉద్యోగం కట్టబెట్టడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని వారు పేర్కొన్నారు.అంతేకాకుండా, గ్రామసభలో వ్యక్తమైన అభ్యంతరాలను, స్థానిక అభ్యర్థుల నిరసనలను పూర్తిగా బేఖాతరు చేస్తూ సుమారు 12 రోజుల క్రితమే అత్యంత రహస్యంగా ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారని ఆరోపించారు. ఐసీడీఎస్, సీడీపీఓ అధికారులు నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించి ఈ నియామకాన్ని చేపట్టారని విమర్శించారు.ఈ వ్యవహారంపై బాధిత అభ్యర్థులు సోమవారం అంతాడలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. తప్పుడు ధృవీకరణ పత్రాలతో ఉద్యోగం పొందిన వారిపై, వారికి సహకరించిన అధికారులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ నియామకాన్ని వెంటనే రద్దు చేసి అర్హులైన స్థానిక అభ్యర్థులకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.తమ ఫిర్యాదుపై అధికారులు స్పందించకపోతే సహించేది లేదని బాధిత అభ్యర్థులు హెచ్చరించారు. అక్రమ నియామకాన్ని రద్దు చేయకపోతే అంగన్‌వాడీ కేంద్రానికి తాళాలు వేసి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని కె. రామలక్ష్మి, కె. వీణ, కె. లోవకుమారి, ఎస్. దుర్గాదేవి తదితరులు పత్రికా సమావేశంలో స్పష్టం చేశారు.




## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్

**రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్ - ఏబీవీపీ**

**విశాఖపట్నం (జయ జయహే)**

రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ( ఏబీవీపీ ) ఆధ్వర్యంలో ఈనెల 5 బుధవారం రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్ కు పిలుపునిస్తున్నట్టు ఏబీవీపీ విశాఖపట్నం విభాగ్ కన్వీనర్ నితిన్ తెలిపారు. ఈ మేరకు బంద్ కు సంబంధించిన గోడపత్రికను డాక్టర్ వి ఎస్ కృష్ణ కాలేజీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నితిన్ మాట్లాడుతూ.. పెండింగ్ లో ఉన్న 6,800 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను త్వరితగతిన విడుదల చేయాలన్నారు. జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిగ్రీ సహా అన్ని కోర్సుల ప్రవేశాలను తక్షణమే పూర్తి చేయాలని అన్ని విశ్వవిద్యాలయాలకు ఉమ్మడి అకాడమిక్ క్యాలెండర్ ను ప్రకటించాలని కోరారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించి విద్యార్థులకు న్యాయమైన ఆహారాన్ని అందించాలన్నారు. కార్పొరేట్ మరియు ప్రైవేట్ విద్యా వ్యాపారాన్ని అరికట్టి పేద విద్యార్థులకు న్యాయమైన, ఉన్నతమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కళాశాలలో విద్యార్థులు స్వచ్ఛందంగా బందుకు సహకరించి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ప్రసాద్, జాతీయ కార్యవర్గ సభ్యులు కిరణ్ , నగర కార్యదర్శి ధనుష్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందు , కార్యకర్తలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## కలెక్టర్ ద్వారా సిఎంకి ఆర్టీసీ జెఎసి వినతి

**విశాఖపట్నం (జయ జయహే)**

ఎపిపిటిడి (ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జె ఎ సి రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జె ఎ సి ఆధ్వర్యంలో రెండవ దశ ఉద్యమకార్యాచరణలో భాగంగా జిల్లా లోని అన్ని డిపోలు యూనిట్లు లో ఉన్న ఉద్యోగులందరి సంతకాలతో ఉన్న బుక్ లెట్ ను సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం స్పందనలో జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరీ కు సమర్పించి జిల్లా కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి కు అందించాలని కోరారు జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు అనంతరం మీడియా తో రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ లో ప్రవేశ పెడుతున్న ఎలెక్ట్రిక్ బస్సులు ఆర్టీసీ ఉద్యోగులతేనే నిర్వహించాలని కొత్తగా 4వేల బస్సులు స్త్రీ శక్తి పథకం అమలుకు అవసరమని వెంటనే ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు.జిల్లా జె ఎ సి కన్వీనర్ ఎ కె శివాజీ మాట్లాడుతూ ఆర్టీసీలో 10 సంవత్సరాల నుండి రిక్రూట్ మెంట్ లేక ఉద్యోగులు డబల్ డ్యూటీలు చేసి స్త్రీ శక్తి పథకంను సక్సెస్ చేస్తూ ప్రభుత్వంనకు మంచి పేరు వచ్చేలా కృషి చేస్తున్నారని తక్షణం 15వేల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. సి యన్ జి బస్సులు ద్వారా తక్కువ ఖర్చుతో ప్రయాణీకులకు సేవలు అందేలా ప్రభుత్వం చూడాలని ఆర్టీసీ ఆస్తులు కాపాడాలని ఎలెక్ట్రిక్ బస్సులు పై ఆర్టీసీ సిబ్బందికి ట్రైనింగ్ ఇచ్చి ఆర్టీసీ డ్రైవర్ కండక్టర్ గ్యారేజీ సిబ్బంది తోనే నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా జె ఎ సి నాయకులు పాల్గొన్నారు



## రైతు బజార్‌లో సన్న బియ్యం విక్రయాలు ప్రారంభించిన కలెక్టర్

**అనకాపల్లి జయ జయహే**

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ జాయింట్ కలెక్టర్ సౌర్య పటేల్ స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సోమవారం స్థానిక ఎన్టీఆర్ బలం మార్కెట్లో గల రైతు బజార్లో బిపిటి సన్న బియ్యం విక్రయాలు ప్రారంభోత్సవం జరిగింది కేజీ 52 రూపాయలు ధరతో ప్రజలకు 10 కేజీల వరకు అందించడం జరుగుతుందని వారు పేర్కొనడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు రాష్ట్ర రైస్ మిల్లర్ల సహకారంతో బిపిటి స్టీమ్ సన్న బియ్యంని ప్రజలకు అందుబాటులో తీసుకురావడం జరిగిందని అలాగే త్వరలో మరో రకం బీపీటీస్ సన్న బియ్యం కిలో 60 రూపాయలకు ధరకు అందించినట్లు వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర డి సి ఎం ఎస్ చైర్మన్ బాలాజీ బిజెపి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వర సివిల్ సప్లై అధికారులు మరి కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# హాస్టల్ విద్యార్థులతో ఫ్రెండ్‌షిప్ వేడుకలు






**అనకాపల్లి (జయ జయహే)**

అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపకు చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ మరియు పిన పోతుల సంతోష్ ఆధ్వర్యంలో గాంధీనగరం ఎస్ సి, బి సి హాస్టల్ విద్యార్థుల మరియు ఉడ్ పేట నేతాజీ సుభాష్ చంద్రబోస్ హాస్టల్ విద్యార్థుల సమక్షంలో స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ వేడుకల్లో 450 మంది విద్యార్థులకు ఫ్రెండ్షిప్ డే బ్యాంగిల్స్, మిఠాయిలు, టాటా గ్లూకోజ్, డ్రింక్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్రెండ్ షిప్ వేడుకల్లో విద్యార్థులకు సంతోషానికి అవధులు లేవు వాళ్ల ఆనందానికి సంతోషానికి వెలకట్టలేము హాస్టల్స్ లో చదువుకున్న విద్యార్థులు బయటికి వెళ్లి ఇటువంటి వేడుకలు చేసుకొలేరు కాబట్టే గత ఆరు సంవత్సరాలుగా స్నేహితుల దినోత్సవ వేడుకలు అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ నిర్వహిస్తున్నందుకు ప్రవీణ్ కి ధన్యవాదములు తెలుపుతూ. ఈ సందర్భంగా విద్యార్థులు కోసం అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ చదువుకోవడానికి విద్యార్థులు ఎక్కడెక్కడ నుంచో వచ్చి చదువుకుంటూ హాస్టల్స్ లో చదువుకున్న విద్యార్థులు కులమతాలు, ప్రాంతాలు ఉండవు, వాళ్లకి తెలిసిన ఒకే ఒక కులం చదువు తప్ప వేరే కులం ఉండదు. వేరే మతం ఉండదు. మీ అందరూ బాగా చదువుకోవాలని మీ అందరి కోసం ఎప్పుడూ కూడా అబ్దుల్ కలాం సేవా సంఘం మీ కోసం అనేక కార్యక్రమలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు . ఈ కార్యక్రమంలో జాన్ వెస్లీ,దాడి దీపు,రాజు, కృష్ణ, ఎస్సీ వెల్ఫేర్ వార్డెన్, రామయ్య, బిసి వెల్ఫేర్ శ్రీను, నేతాజీ సుభాష్ చంద్రబోస్ హాస్టల్ ఉపాధ్యాయులు, అధిక సంఖ్యల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## అంకితభావంతో పనిచేయండి

**అంగన్వాడీలకు ఎమ్మెల్యే హితవు**

**చోడవరం, ఆగస్టు 3 జయ జయహే**

చోడవరం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 17 మంది అంగన్వాడీ టీచర్లు , ఆయాలకు ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు చేతుల మీదుగా జాయినింగ్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియామకాలు పొందిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు మహిళల సంక్షేమం కోసం మీరు అంకితభావంతో సేవలందిస్తూ ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. అంగన్వాడీ వ్యవస్థ బలోపేతమే మహిళా, శిశు సంక్షేమానికి బలమైన పునాది. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

## జంగు పట్టిన స్తంభాన్ని తొలగించండి

**ప్రజల ఆందోళన**

**చోడవరం ఆగస్టు 3, జయ జయహే**



చోడవరం లక్ష్మీదేవిపేట వీధిలో రోడ్డు పక్కన ఉన్న పాత ఇనుప స్తంభం పూర్తిగా జంగు పట్టి పుచ్చుపోయి అత్యంత ప్రమాదకర స్థితిలో ఉందనీ, ఎప్పుడు కూలిపోతుందో అనే భయంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆ పాత స్తంభాన్ని తొలగించి, దాని స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలని లక్ష్మీదేవిపేట వీధి ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

**చోడవరం ఆగస్టు 3, జయ జయహే**



తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని, ఆరోగ్యమని కాబట్టి ప్రతి ఒక్కరు బిడ్డకు తల్లిపాలు విధిగా అంగన్వాడి సూపర్వైజర్ శాంతిప్రియ విజయం చేశారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా సోమవారం చోడవరం ద్వారకా నగర్ అంగన్వాడి సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని తల్లులకు పన్ను సూచనలు చేశారు. జరిపారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ జి ఈశ్వరమ్మ తల్లులు పాల్గొన్నారు.



## అంతాడ పంచాయతీలో పీజీఆర్ఎస్ ఫిర్యాదుల స్వీకరణ

**మొత్తం 21 ఫిర్యాదులు నమోదు..**

**కొయ్యూరు :(జయ జయహే)న్యూస్ ఆగష్టు 04**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కొయ్యూరు మండలం అంతాడ పంచాయతీలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 21 ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందన్నారు.రెవెన్యూ - 8,పిఆర్ 2,తాగునీటి సమస్యలు 5,అంగన్వాడీ 2,హెల్త్ - 1,వ్యవసాయం - 3 వచ్చాయి అన్నారు. స్వీకరించిన అన్ని ఫిర్యాదులను పీజీఆర్ఎస్ పోర్టల్ లో నమోదు చేసి సంబంధిత శాఖ అధికారులకు పరిష్కార నిమిత్తం పంపడం జరిగిందన్నారు.



## చోడవరంలో వెంటాడుతున్న పిచ్చికుక్క

**15 మందికి గాయాలు**

**చోడవరం ఆగస్టు 3 జయ జయహే**

చోడవరంలో ఓ పిచ్చి కుక్క ప్రజలను వెంటాడుకుందాం. గత రెండు రోజులుగా సుమారు 15 మందిని కాటు వేసింది. దీంతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ కార్యాలయం ఎదుట పలు ప్రాంతాల్లో పిచ్చికుక్క తీవ్రంగా గాయపరిచింది. గాయపడ్డ వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతున్నారు.చోడవరం పట్టణంలో కుక్కలు ఎక్కువగా తిరుగుతూ ఉండడంతో చోడవరం పట్టణ వాసులు ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. చోడవరం పంచాయితీ కార్యాలయం ఎదుట ఇద్దరిని, పోలీస్ స్టేషన్ ఎదురుగా ఒకరిని, జవహర్లాల్ క్లబ్బు ఎదురుగా ఇద్దరిని, ఒక పిచ్చికుక్క గాయాల పాలు చేసింది. అలాగే సోమవారం కూడా కోట వీధి లో పది మందిని కాటు వేసిందని చెబుతున్నారు. కుక్కలు బెడద ఎక్కువగా ఉండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు, పాలకులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పెద్దేరు నదిపై ప్రతిపాదిత వంతెనను చాకిపల్లి గ్రామం వద్ద నిర్మించాలి

**చోడవరం ఆగస్టు 3 జయ జయహే**



పెద్దేరు నదిపై నిర్మించ తలపెట్టిన వంతెనను చోడవరం మండలం చాకిపల్లి వద్ద నిర్మించాలని జనసేన పార్టీ కోరుతుంది. ఈ మేరకు సోమవారం నియోజకవర్గంలోని చాకిపల్లి, రామజోగిపాలెం, కన్నంపాలెం గ్రామాలకు చెందిన జనసేన పార్టీ నాయకులు అమరావతిలోని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చాకిపల్లి గ్రామ సమీపంలోని పెద్దేరు నదిపై వంతెన లేకపోవడంతో రైతులు, మహిళలు, విద్యార్థులు, గ్రామ ప్రజలు ప్రతిరోజూ ప్రాణాలను పణంగా పెట్టుకుని తీగ సహాయంతో నదిని దాటాల్సిన దుస్థితి నెలకొన్న విషయాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చాకిపల్లి గ్రామం వద్ద వంతెన నిర్మాణానికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.అయితే ప్రస్తుతం కొందరు వ్యక్తులు రాజకీయ ప్రయోజనాల కోసం, మెజారిటీ ప్రజలకు ఉపయోగపడే చాకిపల్లి గ్రామంలో కాకుండా వేరే ప్రాంతంలో వంతెన నిర్మాణం చేపట్టే ప్రయత్నాలు చేస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి చర్యలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, వ్యవసాయ అవసరాలు, రాకపోకలు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చాకిపల్లి గ్రామం వద్దనే వంతెన నిర్మాణం చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.గ్రామస్థుల విజ్ఞప్తిని సానుకూలంగా స్వీకరించిన జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం , సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను చాకిపల్లి గ్రామానికి పంపించి క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, మెజారిటీ ప్రజలకు ఉపయోగపడే ప్రదేశంలోనే వంతెన నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు యలమంచిలి శ్రీను, నేమాని సింహాచలం, తుమ్మపాల దేముళ్లు నాయుడు, పోతల అప్పారావు, యలమంచిలి హరికృష్ణ, పోలేపల్లి శ్రీనివాసరావు, వడ్డాది సాయి తేజ, పోలేపల్లి భాను ప్రసాద్, యలమంచిలి విజయకుమార్, తలారి గణేష్ పాల్గొన్నారు.




## విద్యా శాఖ మంత్రి విద్యను గాలికొదిలేసారు: ఎబివిపి

**విజయనగరం (జయ జయహే)**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ విజయనగరం నగర శాఖ ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాయికుమార్ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో విద్యా శాఖ మంత్రి విద్యా శాఖని గాలికొదిలేసి మిగతా అన్ని శాఖలను పట్టించుకుంటున్నారని, రాష్ట్రంలో 6800 కోట్లు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు పెండింగ్ లో ఉంటే వాటిని పట్టించుకోరని తెలిపారు . రాష్ట్రంలో డిగ్రీ, బీటెక్ అడ్మిషన్స్ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. అలాగే సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని అన్నారు జీ వో నంబర్ 77 ను రద్దు చేసి, పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించాలని అన్నారు అలాగే కార్పొరేట్, ప్రైవేట్ విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని అన్నారు ఈ సమస్యల పరిష్కారం కోసం ఆగస్ట్ 5 వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలకు బంద్ ప్రకటించటం జరిగింది అన్నారు ఈ బంద్ ను విద్యార్థుల, కళాశాల యాజమాన్యాలు విజయవంతం చేయాలని కోరారు



## వీఎంఆర్డీఏ ప్రజదర్బార్‌కు మూడు వినతులు

**విశాఖపట్నం, ఆగస్టు 3, జయ జయహే**

వీఎంఆర్డీఏలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు పలువురు అర్జీదారులు వినతులు సమర్పించారు. సోమవారం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొని అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను తెలుసుకుని, ఆయా వినతులను సంబంధిత అధికారులకు అందజేసి, వాటిని సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వినతుల పరిష్కార విషయంలో శాఖాపరంగా తీసుకున్న చర్యల వివరాలను నిర్ధేశించిన గడువు లోగా అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు మొత్తం 3 వినతులు రాగా, వీటిలో ఏస్టేటు విభాగానికి చెందిన వినతులు 2, పరిపాలన విభాగానికిచెందిన వినతులు 1 చొప్పున ఉన్నాయి. కార్యక్రమంలో ఓఎస్డీ కృష్ణ నాయక్, ఏస్టేటు అధికారి దయానిధి, అటవీ విభాగాధికారి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ నరసింహా కిషోర్

**రాజమహేంద్రవరం: జయ జయహే: ఆగస్టు3**



తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ జునైద్ అహ్మద్ మౌలానాను తూర్పుగోదావరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డి. నరసింహ కిషోర్ సోమవారం రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలోని జడ్జి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి నూతన బాధ్యతల స్వీకరణ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. న్యాయవ్యవస్థ గౌరవాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తూ, న్యాయపాలన బలోపేతానికి పోలీసు శాఖ సంపూర్ణ సహకారం అందిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు.భేటీ ఆత్మీయ వాతావరణంలో సాగగా,న్యాయవ్యవస్థ-- పోలీసు శాఖల మధ్య పరస్పర సమన్వయం ప్రజలకు సత్వర న్యాయం, సమర్థవంతమైన శాంతిభద్రతల పరిరక్షణకు దోహదపడుతుందని ఇరువురు అభిప్రాయపడ్డారు.

## యువత భవిష్యత్‌తో చెలగాటం వద్దు

**ఆర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం: జయ జయహే**



ఆగస్ట్3: నిట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై నమోదైన పోలీసు కేసులను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని ఆర్పిసి ప్రధాన కార్యాలయంలో జరిగిన వారాంతపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ యువత భవిష్యత్తుపై తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. నిట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో నిజమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ఆందోళనలను అణచివేయకుండా వారి ఆవేదనను ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, ఉపాధి అవకాశాల కల్పన, యువత హక్కుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. విద్యార్థుల నిరసనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. అయితే, నష్టపోయిన విద్యార్థులకు ఇంకా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు హక్కు అని, వాటిలో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.సమావేశానికి ఆర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు.ఈ సమావేశంలో డి.వి. రమణమూర్తి, సిమ్మా దుర్గారావు, దుడ్డే సురేష్, వర్ధనపు శరత్‌కుమార్, వాడపల్లి జ్యోతిష్, గుడ్ల సాయిదుర్గా ప్రసాద్, బసా సోనియా, దుడ్డే త్రినాద్, మాసా అప్పాయమ్మ, మట్టపర్తి తులసి, మాసా సుభద్ర, కందివలస రమణ, కందివలస హైమావతి, కూరాకుల నాగమణి, మాసా ప్రవీణ్, మాసా ప్రమీల, అడపా శేషగిరి, మీసాల దేవి, చల్లా సాంబశివరావు, నాగురి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి





### జీఓ నెం.3కు చట్టబద్ధత కల్పించాలి

### ముంచంగిపుట్టులో ఆదివాసీ ప్రజా సంఘాల భారీ ర్యాలీ

### రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపు

**ముంచంగిపుట్టు, జయ జయహే**

1/70 భూ బదలాయింపు నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంతో పాటు జీఓ నెం.3కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ఆదివాసీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక గెస్ట్ హౌస్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి, అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం. శ్రీను అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి పి. బాలదేవ్, గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు బి. బాబురావు, ఎం. రామకృష్ణ, ఎం. అనిల్ మాట్లాడుతూ, ఐదో షెడ్యూల్ పరిధిలోని భూములు కేవలం ఆదివాసీలకే చెందాలని చట్టాలు స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, అమలులోని లోపాల కారణంగా గిరిజనేతరులు ఏజెన్సీ ప్రాంతాల్లో భూములను అక్రమంగా ఆక్రమిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 1/70 చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ 1,672 మంది గిరిజనేతరులు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారని, 2011 జనాభా లెక్కల ప్రకారం ఏజెన్సీలో తామే మెజారిటీగా ఉన్నామని పేర్కొంటూ చట్ట సవరణ కోరుతున్నారని వివరించారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసి మూడేళ్లు గడిచినా, ఇప్పటివరకు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడం గిరిజన హక్కుల పరిరక్షణపై ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని సూచిస్తోందని విమర్శించారు. అదేవిధంగా, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడం, జీఓ నెం.3కు చట్టబద్ధత కల్పించడం వంటి డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 8న నిర్వహించనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కె. నర్సయ్య, జిల్లా నాయకులు కె. త్రినాథ్, ప్రజా సంఘాల నాయకులు జగబంద్, పి. పద్మారావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. ధర్మాన పడాల్, నాయకులు బి. గంగాధర్, సునీల్, రాందాస్, వి. కొండలరావు, కె. శంకర్, రమేష్, సింహాచలం, ఎంపీపీ. సీతమ్మ, వైస్ ఎంపీపీ పి. సత్యనారాయణ తో పాటు పలువురు ప్రజా సంఘాల నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.



## వీఎంఆర్‌డీఏ కార్యదర్శా...మజాకా...!

**- రూపాయి అద్దె లేకుండా ఫ్రీగా గెస్ట్ హౌస్‌లో మకాం**

**- ఫుడ్డు...బెడ్డు...అన్నీ వీఎంఆర్‌డీఏ ఖాతాకే**

**- అయ్యగారి లీలలు మామూలుగా లేవుగా**

**- ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మూర్తి యాదవ్**

**విశాఖపట్నం, ఆగస్టు 3, జయ జయహే :**

వి.ఎం.ఆర్.డి.ఎ కార్యదర్శి గత రెండేళ్లుగా గురజాడ కళాక్షేత్రం అతిథి గృహంలో మకాం పెట్టాడని...ఒక్క రూపాయి అద్దె చెల్లించకుండా తిరిగి జీతంతో పాటు హెచ్.ఆర్.ఎ ఠంఛనుగా డ్రా చేస్తూ ప్రభుత్వానికి కన్నం పెడుతున్నాడని మాజీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ అతిథి గృహం అద్దె కనీసం రోజుకి వెయ్యి రూపాయలు ఉంటుంది అంటే సుమారు రూ. 7,30,000తో పాటు కరెంటు బిల్లు మరియు ఇతరత్ర కలిపి దాదాపు పది లక్షలు సంస్థ కు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒక అధికారి హెచ్.ఆర్.ఎ తీసుకుంటూ సంస్థకు చెందిన గెస్ట్ హౌస్ లో నెలలు కాదు సంవత్సరాల పాటు పైసా అద్దె చెల్లించకుండా విద్యుత్ బిల్లులు చెల్లించకుండా ఉండటం సంస్థ ప్రతిష్టనే దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. స్కాట్లాండ్ సెక్యూరిటీ సర్వీసెస్ టెండర్ పిలవకుండా సెక్రటరీ నెల వారి మామూళ్ళు లక్షల్లో వసూలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోందని దానిపై నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. సుమారు 100 మంది పైగా అదనంగా సిబ్బందిని స్కాట్లాండ్ సెక్యూరిటీ సంస్థ ద్వారా అక్రమంగా నియమించి ఉద్యోగ నియామకాలు లక్షల్లో వసూలు చేసారని ఆరోపణలు ఉన్నందున దీనిపై విచారణ జరపాలన్నారు. మిగిలిన సంస్థల్లో మాదిరిగా ఈ సిబ్బంది ఎక్కడెక్కడ విధులు నిర్వర్తిస్తున్నారో ప్రతిరోజూ మానిటర్ చేసే యంత్రాంగాన్ని (ఎఫ్.ఆర్.ఎస్) ఏర్పాటు చేయాలి." అని పేర్కొన్నారు .

### ఆర్‌ఆర్‌బి అభ్యర్థుల కోసం

## ప్రత్యేక జన సాధారణ్ రైలు

**ఉత్తరాంధ్ర నిరుద్యోగుల కోసమే ఈ స్పెషల్**

**దక్షిణ కోస్తా రైల్వే ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జోనల్ అధ్యక్షులు డాక్టర్ పెదిరెడ్ల రాజశేఖర్**

**విశాఖపట్నం, ఆగస్టు 3, జయ జయహే :**




ఉత్తరాంధ్రలో నిరుద్యోగలు ఉద్యోగ అవకాశాల కోసం ఆశగా ఎదురు చూస్తున్న తరుణంలో ఆర్ ఆర్ బి ద్వారా నిర్వహిస్తున్నటువంటి సిబిటి పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి దక్షిణ కోస్తా రైల్వే ప్రత్యేక జనసాధారణ్ రైలును నడుపుతోందని దక్షిణ కోస్తా రైల్వే ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జోనల్ అధ్యక్షులు డాక్టర్ పెదిరెడ్ల రాజశేఖర్ తెలిపారు. పరీక్షా కేంద్రాలు సుదూర ప్రాంతంలో ఉండడం చేత ప్రయాణం చేయాల్సి వచ్చినప్పుడు అభ్యర్థులు పడే అవస్థలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి ప్రత్యేకమైన జన సాధారణ్ రైలు సర్వీసులు నడుపుతోందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంత నిరుద్యోగులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని స్వశక్తితో, నిజాయితీతో పరీక్షలకు హాజరై మంచి భవిష్యత్తు ని రూపొందించుకోవాలని ఆశిస్తున్నామన్నారు. ఈ రైల్ ట్రైన్ నెంబర్ గల 07067 ప్రత్యేక రైలు ఈ నెల 2 వ తారీకు నుంచి 5 తారీకు వరకు నాలుగు ట్రిప్పులు నడుపుతారు. మన ఉత్తరాంధ్ర ప్రాంతం పలాస నుండి విజయవాడ వరకు ఈ రైలు నడుస్తుంది. పలాస లో మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2: 50 శ్రీకాకుళం రోడ్, మధ్యాహ్నం 3: 43 విజయనగరం, సాయంత్రం 4: 28 సింహాచలము , సాయంత్రం 5: 50 విశాఖపట్నం ,సాయంత్రం 6 : 40 దువ్వాడ , రాత్రి 7:42 తుని, రాత్రి 8: 22 సామర్లకోట , రాత్రి 9 : 15 రాజమండ్రి , రాత్రి 10:38 కి ఏలూరు మీదుగా రాత్రి 1:00 విజయవాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ట్రైన్ నెంబర్ :07068 విజయవాడ నుంచి పలాసకు ఈనెల 3 తేదీ నుంచి 6 తారీకు వరకు నాలుగు ట్రిప్పులు నడుస్తోంది. విజయవాడలో సాయంత్రం 4:30గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు జామున 4: 30 నిమిషాలకు పలాస చేరుతుంది. విజయవాడ లో సాయంత్రం 4:30గంటలకు, సాయంత్రం 5:45 కి ఏలూరు , రాత్రి 8:10 రాజమండ్రి , రాత్రి8: 55 సామర్లకోట , రాత్రి9:33 తుని, రాత్రి11:35 దువ్వాడ ,రాత్రి12:30 విశాఖపట్నం , రాత్రి 1:08 సింహాచలము , రాత్రి 1:48 విజయనగరం, రాత్రి 2:43 శ్రీకాకుళం రోడ్, 4:30 పలాస తెల్లవారుజామున చేరుకుంటుందని తెలిపారు. మాత్రమే ఉందని జగన్ మురారి అన్నారు. దమ్ముంటే గత 12 సంవత్సరాల మోదీ పాలనలో విశాఖకు మీరేం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలో ఉన్నట్లుగా వెనుకబడిన జిల్లాగా విశాఖకు ఎంత నిధులు విడుదల చేశారు, స్మార్ట్ సిటీకి ఎంత నిధులు విడుదల చేశారు, కొత్త ప్రాజెక్టులు ఏం తెచ్చారు, చేసిన అభివృద్ధి ఏమిటి అనే ప్రతి అంశంపై స్పష్టంగా బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు శ్వేతపత్రం విడుదల చేయాలని జగన్ మురారి సవాల్ విసిరారు.

## సురకల నీతు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ


### బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

**విశాఖపట్నం (జయ జయహే)**





గంగవరం తీరంలో జరిగిన విషాదకర ఘటనలో మృతి చెందిన కొత్త జాలారిపేటకు చెందిన కుమారి సురకల నీతు కుటుంబాన్ని విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు, జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ , విషాద ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. తమ కుటుంబ సభ్యురాలిని కోల్పోయిన బాధలో ఉన్న కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులు, నేవీ సిబ్బందితో ఎమ్మెల్యే మాట్లాడి, మృతదేహాన్ని వెలికితీసేందుకు అవసరమైన చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. బాధిత కుటుంబానికి సాధ్యమైనంత త్వరగా సహాయం అందేలా అన్ని విధాలా కృషి చేయాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, “కుటుంబ సభ్యురాలిని కోల్పోయిన బాధ వర్ణనాతీతం. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం మనందరి బాధ్యత. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటాం” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని బాధిత కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు



## ప్రజా సమస్యలపై సత్వర పరిష్కారం

**అధికారులను ఆదేశించిన ఇన్‌చార్జి కలెక్టర్ జి. విద్యాధరి**

**విశాఖపట్నం, ఆగస్టు 3, జయ జయహే**

ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులను ప్రాధాన్యతతో పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ జి. విద్యాధరి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆరఎస్) కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన మొత్తం 354 వినతులు స్వీకరించినట్లు తెలిపారు. అందిన వినతుల్లో జీవీఎంసీకి సంబంధించి 109, రెవెన్యూ శాఖకు 56, పోలీస్ శాఖకు 31, ఇతర శాఖలకు 158 వినతులు నమోదయ్యాయని వెల్లడించారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి తమ సమస్యలను తెలియజేస్తున్నందున ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. పరిష్కారంలో జాప్యం లేకుండా, పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు మరింత చొరవ చూపాలని ఇన్‌చార్జి కలెక్టర్ జి. విద్యాధరి పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విశాఖను మోడీ అభివృద్ధి చేశారా...!

## చెప్పడానికి...సిగ్గుండాలి

**విశాఖపట్నం, ఆగస్టు 3, జయ జయహే :**



మోదీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక ఆంధ్రప్రదేశ్‌ను చిన్నచూపు చూస్తున్నారని, కొత్త రాష్ట్రానికి అందాల్సిన సహాయం అందడం లేదని కాంగ్రెస్ నాయకుడు జగన్ మురారి విమర్శించారు. బీజేపీ నాయకులు మాత్రం రాష్ట్రానికి వరాలు కురిపించామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 పూర్తిగా అమలు కాలేదని, మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఇంకా మొదలు కాలేదని, రైల్వే జోన్ నత్తనడకన సాగుతోందని, స్టీల్ ప్లాంట్‌ను చంపేయాలని చూస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. విభజన చట్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం విశాఖ కేంద్రంగా అంతర్జాతీయ విమానాశ్రయం అంశాన్ని షెడ్యూల్ 13, సెక్షన్ 93, ఐటెం నంబర్ 6 లో పెట్టిందని, అందువల్లే మోదీ ప్రభుత్వం ఇవ్వక తప్పలేదని అన్నారు. మోదీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎయిర్‌పోర్టు ప్రారంభానికి పుష్కరకాలం ఎందుకు పడుతుందని ప్రశ్నించారు. “ పోలవరం, మోదీ వరం” అని బీజేపీ ప్రకటించుకుంటోందని, పోలవరం క్రెడిట్‌ను బీజేపీ కొట్టేయాలని చూస్తే మాజీ సీఎం డాక్టర్ వై.ఎస్.ఆర్ అభిమానులు, ప్రజలు బీజేపీని రాష్ట్రం నుండి తరిమికొడతారని జగన్ మురారి హెచ్చరించారు. పోలవరం డా.వై.ఎస్. రాజశేఖరెడ్డి మానస పుత్రిక అని, ఆ ప్రాజెక్టుకు ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. విశాఖను తామే ఉద్ధరించినట్లుగా బీజేపీ చెప్పుకుంటోందని, విశాఖ అభివృద్ధిలో బీజేపీ పాత్ర ఆవగింజంత మాత్రమే ఉందని జగన్ మురారి అన్నారు. దమ్ముంటే గత 12 సంవత్సరాల మోదీ పాలనలో విశాఖకు మీరేం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలో ఉన్నట్లుగా వెనుకబడిన జిల్లాగా విశాఖకు ఎంత నిధులు విడుదల చేశారు, స్మార్ట్ సిటీకి ఎంత నిధులు విడుదల చేశారు, కొత్త ప్రాజెక్టులు ఏం తెచ్చారు, చేసిన అభివృద్ధి ఏమిటి అనే ప్రతి అంశంపై స్పష్టంగా బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు శ్వేతపత్రం విడుదల చేయాలని జగన్ మురారి సవాల్ విసిరారు.

## నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్

**ఉద్యోగాల భర్తీ పేరుతో ఆటలాడుకున్నారు**

**నిరుద్యోగ నియామకాలు, భృతి హామీల విస్మరణ**

**యువత ఆందోళనలను పట్టించుకోని కాంగ్రెస్**

**మీడియా సమావేశంలో మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్**

**(జయ జయహే)**

రాష్ట్రంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను సిఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విస్మరించారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. యూత్ డిక్లరేషన్ పేరిట ప్రచారంతో కాంగ్రెస్ ఊదరగొట్టిందని విమర్శించారు. జాబ్‌లు భర్తీ చేయకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో కెటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 20వేల పోలీసు ఉద్యోగాల ఖాళీలు ఉంటే.. 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడమేంటన్నారు. ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావాలని.. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను క్రిమినల్ వేస్ట్ అని సీఎం అంటున్నారు. ముఖ్యమంత్రి బాధ్యత లేకుండా మాట్లాడు తున్నారని మండిపడ్డారు. సీఎం వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించరా..? యూత్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ 24 హామీలు ఇచ్చి ఒక్కటైనా నెరవేర్చిందా..? అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న రేవంత్‌రెడ్డే క్రిమినల్ వేస్ట్ అంటూ విమర్శలు గుప్పించారుఉ. సీఎం రేవంత్ రెడ్డి ఏం చదివారో కూడా నాకు డౌటే. ఆయన ఎన్నికల నామినేషన్ పత్రం సొంతంగా నింపుకోగలరా?. ఆయన ఒక్క ఇంటర్వ్యూకైనా వెళ్లారా..?‘ అని కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో యువత తీవ్ర నిరాశలో ఉందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలోని యువత ఒక రకమైన నిర్వేదంలో ఉందన్నారు. దేశ రాజకీయాలను గమనిస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ విషయం అర్థమవుతోందని.. ఎన్నికల సమయంలో యువతను వాడుకోవడం కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు అలవాటుగా మారిందన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ను ప్రస్తావిస్తూ.. రెండేళ్ల క్రితం కూడా ఉద్యోగాల భర్తీపై హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రచార సభల్లో ఇచ్చిన హామీలకు విలువ లేకపోయినా, కనీసం శాసనసభలో ఇచ్చిన మాటకైనా విలువ ఉండాలని అన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com